31వ వసంతంలోకి

# చురకలు

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల

శుక్రవారం 27 మార్చి 2026 పేజీలు : 8

# రిటైర్డ్ ఉద్యోగులకు అండగా ఉంటా

## మాజీ మంత్రి జీవన్ రెడ్డి



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, మార్చి 26:** రాబోయే రోజుల్లో రిటైర్డ్ ఉద్యోగులకు అండగా ఉంటానని మాజీ మంత్రి టి.జీవన్ రెడ్డి భరోసా ఇచ్చారు. జగిత్యాల పట్టణంలో ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘ భవనంలో రిటైర్డ్ ఉద్యోగస్తులను బుధవారం కలిసి వారి సమస్యలను జీవన్ రెడ్డి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగస్తులు మొదటి నుండి తనతో కలిసి ఉన్నారని, రాబోయే రోజుల్లో కూడా అండగా నిలవాలని కోరారు. పట్టభద్రుల ఎమ్మెల్సీకి పోటీ చేస్తున్న సమయంలో కలవగానే నన్ను ఆదరించి నా గెలుపులో భాగస్వాములయ్యారని గుర్తు చేశారు. ప్రతి సమస్య పైన శాసనమండలిలో నా గొంతును వినిపించానని చెప్పారు. ప్రభుత్వం వచ్చిన ప్రభుత్వంలో ఉండి రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పైన మాట్లాడానని, రాబోయే రోజులలో కూడా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని జీవన్ రెడ్డి హామీ ఇచ్చారు. రిటైర్డ్ ఉద్యోగులు ప్రభాకర్ రావు, ఎన్నం రాంరెడ్డి, చంద్ర శేఖర్, తదితరులున్నారు.

# డిఫెన్సివ్ డ్రైవింగ్ సంస్కృతిని అలవాటు చేసుకోవాలి






## -ఎస్పీ అశోక్‌కుమార్

**చురకలు ప్రతినిధి, జగిత్యాల, మార్చి 26:** ప్రతి ఒక్కరు డిఫెన్సివ్ డ్రైవింగ్ సంస్కృతిని అలవాటు చేసుకోవాలని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. గురువారం అరైవ్.. అలైవ్ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు ట్రాఫిక్ నియమాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో ఇతర ప్రమాదాల కంటే రోడ్డు ప్రమాదాల వల్లనే ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదాలను గణనీయంగా తగ్గించేందుకు జిల్లా పోలీస్ శాఖ కట్టుదిట్టమైన చర్యలతో పాటు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నదని తెలిపారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు రోడ్డు భద్రతా వ్యవస్థలను బలోపేతం చేయడం, ప్రజల్లో డిఫెన్సివ్ డ్రైవింగ్ సంస్కృతిని పెంపొందించడం ముఖ్య లక్ష్యమని స్పష్టం చేశారు. రోడ్డు ప్రమాదాల్లో అధిక శాతం అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం, మొబైల్ ఫోన్ వినియోగం, ట్రాఫిక్ నియమాలను పాటించకపోవడం వంటి కారణాల వల్లనే జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వాహనం నడిపి, తమతో పాటు ఇతరుల ప్రాణాలను కాపాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాగంగా పోలీస్ కళాబృందం సభ్యులు పాటలు, నాటికల ద్వారా ట్రాఫిక్ నియమాల ప్రాముఖ్యతను ప్రజలకు సులభంగా అర్థమయ్యే విధంగా వివరించారు. హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ వినియోగం, మద్యం సేవించి వాహనం నడపకూడదనే నిబంధనలు, అతివేగం వల్ల కలిగే ప్రమాదాలు వంటి అంశాలను ప్రభావవంతంగా ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యమధర్మ రాజు మరియు చిత్రగుప్తుడు వేషధారణలో ప్రదర్శించిన నాటిక ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఈ నాటికలో రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన వ్యక్తుల జీవితాలను ప్రతిబింబిస్తూ, వారి నిర్లక్ష్యం ఎలా ప్రాణాంతక పరిణామాలకు దారితీసిందో హృద్యంగా చూపించారు. యమధర్మరాజు, చిత్రగుప్తుడు పాత్రల ద్వారా ప్రతి మనిషి తన చర్యలకు తానే బాధ్యత వహించాల్సిన అవసరాన్ని స్పష్టం చేస్తూ, చిన్న పొరపాటు కూడా ఎంతటి పెద్ద నష్టానికి కారణమవుతుందో సందేశాత్మకంగా తెలియజేశారు. ఈ ప్రదర్శన అక్కడున్న విద్యార్థులు, ప్రజలను విశే షంగా ఆకట్టుకుని, రోడ్డు భద్రతపై లోతైన ఆలోచన కలిగించింది. డీఎస్పీ రఘు చందర్, మున్సి పల్ చైర్మన్ సమీండ్ల వాణి శ్రీనివాస్, ఇన్స్పెక్టర్లు సుధాకర్, కరుణాకర్, ట్రాఫిక్ ఎస్ఐ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

### కొండగట్టులో తాగునీటి

# సమస్యను పరిష్కరించండి

## అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం




**చురకలు ప్రతినిధి, జగిత్యాల, మార్చి 26:** ఉత్తర తెలంగాణలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొండగట్టు అంజన్న సన్నిధిలో సరైన నీటి వసతి లేదని ఎండాకాలంలో తీవ్ర నీటి ఎద్దడి ఎదుర్కొంటున్నామని, సమస్యను పరిష్కరించాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం గురువారం అసెంబ్లీలో ప్రశ్నించారు. కొండగట్టు పక్కనే ఉన్న జేఎన్టీయూ యూనివర్సిటీలో 2000 ల మంది స్టూడెంట్లు చదువుకుంటున్నారని, వీరికి తీవ్రంగా తాగు నీటి సమస్య ఉందన్నారు. గతంలో కొండగట్టుకు ప్రారంభించిన లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు రివైజ్ ఎస్టిమేషన్ ప్రభుత్వం దగ్గర పెండింగ్‌లో ఉందని,.. దానిని త్వరిత గతిన క్లియర్ చేసి పను లు ప్రారంభించాలని కోరారు. కొండగట్టు, జేఎన్టీయూ వీటి పక్కనే ఉన్న రామ్ సాగర్, హిమ్మత్ రావు పేట, తిమ్మాయ పల్లి గ్రామాలకు సాగునీటి సమస్య పరిష్కారం అవుతుందని తక్షణమే నిధులు విడుదల చేసి పనులు ప్రారంభించాలని అసెంబ్లీలో ప్రస్తావించారు.

# మార్కాపురంలో ఘోర బస్సు ప్రమాదం



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, మార్చి 26 :** ఆంధ్రప్రదేశ్లోని మార్కాపురం జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకున్న ఘటనలో 10. మంది సజీవ దహనం కాగా అందులో జగిత్యాల జిల్లాకు చెందిన ఇద్దరున్నారు. గురువారం తెల్లవారుజామున ప్రైవేట్ బస్సు, టిప్పర్ లారీ ఢీకొన్న ఘటనలో 10 మంది ప్రయాణికులు సజీవ దహనమయ్యారు. ఈ ప్రమాదంలో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. జగిత్యాల నుండి బుధవారం సాయంత్రం హైదరాబాద్ మీదుగా ప్రకాశం జిల్లా పామూరుకు సుమారు 40 మంది ప్రయాణికులతో ఒక ప్రైవేట్ బస్సు బయలుదేరింది. మార్కాపురం జిల్లా రాయవరం సమీపంలోని క్వారీల వద్దకు రాగానే, ఎదురుగా వస్తున్న టిప్పర్ లారీని బస్సు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాద తీవ్రతకు బస్సు డీజిల్ ట్యాంక్ పగిలిపోయి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. వేగంగా వ్యాపించిన మంటల్లో బస్సు, టిప్పర్ రెండు చిక్కుకున్నాయి. ప్రమాదం జరిగినప్పుడు ప్రయాణికులు గాఢ నిద్రలో ఉండటంతో ఏం జరుగుతుందో తెలుసుకునేలోపే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. కొందరు ప్రయాణికులు బస్సు అద్దాలు పగలగొట్టుకుని బయటకు దూకి ప్రాణాలు కాపాడుకున్నారు. అయితే 10 మంది మాత్రం మంటల్లో చిక్కుకుని బయటకు రాలేక సజీవ



దహనమయ్యారు. ఈ ప్రమాదంలో జగిత్యాల జిల్లా రాయికల్ మండలం రామారావుపల్లెకు -2లో

# అలరించిన అల్ఫోర్స్ ఫ్యూజన్ వేడుకలు



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, మార్చి 26:** ప్రతి విద్యార్థి తల్లిదండ్రుల ఆశయాల కనుగుణంగా కృషి చేస్తూ వాటిని సాధించాలని, ఉన్నత స్థానాలలో స్థిరపడాలని జగిత్యాల మున్సిపల్ చైర్పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్ అన్నారు. గురువారం అల్ఫోర్స్ పాఠశాలల ఫ్యూజన్ వేడుకలను జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ వాణి మాట్లాడుతూ అల్ఫోర్స్ విద్యా సంస్థల్లో × విద్యార్థులకు చాలా చక్కటి ప్రణాళికలతో విద్యను బోధిస్తూ వారికి చిన్ననాటి నుండే పలు విషయాల పట్ల విస్తృతంగా అవగాహన కల్పించడం చాలా గొప్ప విషయమన్నారు. ప్రధానంగా నరేందర్ రెడ్డి యొక్క కృషి చాలా అపూర్వమైనదని స్ఫూర్తిదాయకమన్నారు. అనంతరం విద్యా సంస్థల అధినేత డాక్టర్ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల శ్రేయస్సు లక్ష్యంగా గత 36 సంవత్సరాలుగా విద్యారంగానికి విశిష్టమైన సేవలు అందిస్తున్నామని, వివిధ రంగాలలో సంచలనాత్మక ఫలితాలు నమోదు చేయడం అల్ఫోర్స్ విద్యాసంస్థల విద్యా విధానానికి ఒక గొప్ప నిదర్శనమని కొనియాడారు. అహర్నిశలు శ్రమిస్తున్నటువంటి సిబ్బంది ద్వారా ఈ అద్భుతమైన ఫలితాలు సాధ్యమవుతున్నాయని భవిష్యత్తులోనూ మీ అందరి సహకారంతో అల్ఫోర్స్ విద్యాసంస్థలు అగ్రగామిగా ఉంటాయని ఆకాంక్షించారు. వేడుకలలో భాగంగా విద్యార్థుల ప్రదర్శించిన పలు సాంస్కృతిక, జానపద నృత్యాలు ఆలోచింపజేసాయి. వార్షిక ప్రణాళికలో భాగంగా అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రోడ్డుకు ఇరువైపులు ఉన్న పిచ్చి చెట్లును తొలగింపు



**చురకలు విలేఖరి వీణవంక మార్చి 26 :** వీణవంక మండలం మల్లారెడ్డిపల్లి నుండి చల్లూరు వరకు రోడ్డుకు ఇరువైపులా ముళ్ళ చెట్లను అడ్డం ఉన్నందున బస్సురావడానికి ఇబ్బందగా ఉందని,రాత్రి సమయంలో ప్రయాణం చేసే ప్రయాణికులకు ప్రమాదాలు పొంచి ఉన్నాయి.గమనించి సర్పంచ్ కొలిపాక రజిత రోడ్డుకు ఇరువైపులా చెట్లను జెసిబి సహాయంతో తొలగించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ అర్సం శ్రీనివాస్,వార్డు సభ్యులు కర్రె నాని యాదవ్, తడిగొప్పుల భవాని,టాక్టర్ ప్రెసిడెంట్ నిమ్మల రాజయ్య బండారి రవి, రాయన వేని తిరుపతి,చంద్రారెడ్డి,నిమ్మల కళ్యాణ్,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన మల్లుగారి నర్సయ్య సార్‌కు సన్మానం



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట మార్చి 26 :** గంభీరావుపేట మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ మల్లు గారి పద్మ ఆమేభర్త మల్లు గారి నర్సయ్య సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిన శుభ సందర్భంగా తిమ్మాపూర్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు,ఎల్లారెడ్డిపేట కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బండారి బాల్రెడ్డి తిమ్మాపురం ఉప సర్పంచ్ జజ్జరి దేవేందర్ ముదిరాజ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు దండు శ్రీనివాస్ ముదిరాజ్ నమలికొండ సత్తయ్య రాజు తిరుపతి రమేష్,ఆంజయ్య తదితరులు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

## మార్కాపురంలో ఘోర బస్సు ప్రమాదం

**మొదటి పేజీ తరువాయి...** చెందిన రమాదేవి, అయోధ్య గ్రామానికి చెందిన వెంకటేష్ లు మృతి చెందడంతో ఆగ్రామాల్లో విషాదం నెలకొంది. ఈ ఘోర ప్రమాదంలో రాయికల్ మండలానికి చెందిన ఇద్దరు మృతి చెందడం పట్ల జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్. సంజయ్ కుమార్, ఎమ్మెల్సీ ఎల్.రమణ, మాజీ మంత్రి జీవన్రెడ్డి, జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాజంగి నందయ్య, జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్రావులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

### విలువలకు పట్టం: ఫిరాయింపుల నీడలో

# నిబద్ధత గల రాజకీయం

**రాజకీయ విలువల 'తాటిపర్తి' రాజీనామా పాఠం**



తెలంగాణ రాజకీయ యవనికపై నాలుగు దశాబ్దాలకు పైగా చెరగని ముద్ర వేసిన సీనియర్ నేత, మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేయడం రాష్ట్ర రాజకీయాల్లో ఒక పెను సంచలనంగా మారింది. ఇది కేవలం ఒక నియోజకవర్గ స్థాయి నాయకుడి అసంతృప్తిగానో, లేదా ఒక వ్యక్తిగత నిర్ణయంగానో పరిగణించ లేము. ఈ పరిణామం వెనుక దశాబ్దాల రాజకీయ నైతికత, పార్టీ సిద్ధాంతాల పట్ల అంకితభావం, ప్రస్తుత రాజకీయాల్లో చోటుచేసుకుంటున్న విలువ కట్టలేని ఫిరాయింపుల సంస్కృతిపై ఒక గంభీరమైన ధిక్కార స్వరం వినిపిస్తోంది. 1980వ దశకంలో ఇందిరా గాంధీ ఆశయాలతో రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన జీవన్ రెడ్డి, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి ఒక బలమైన ధ్వజధారిగా నిలిచారు. జగిత్యాల గడ్డపై ఐదు పర్యాయాలు శాసన సభ్యుడిగా విజయం సాధించి, ప్రజల మనిషిగా గుర్తింపు పొందిన ఆయన, పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు కూడా వెనుకాడకుండా నిలబడ్డారు. ముఖ్యంగా తెలంగాణ ఉద్యమ పతాక స్థాయి సమయంలో, కాంగ్రెస్ అధిష్టానం ఆదేశాల మేరకు కరీంనగర్ లోక్‌సభ ఉప ఎన్నికల్లో కేసీఆర్‌పై పోటీ చేసి పార్టీ పట్ల తన విధేయతను చాటుకోవడం ఆయన నిబద్ధతకు నిదర్శనం. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కాంగ్రెస్ తీవ్ర ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొన్నప్పటికీ, ఉమ్మడి జిల్లాలో ఏకైక ఎమ్మెల్యేగా గెలిచి పార్టీ ఉనికిని కాపాడారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలైనప్పటికీ, కుంగిపోకుండా పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఎన్నికై శాసనమండలిలో కాంగ్రెస్ పక్షనేతగా ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడంలో ఆయన పోషించిన పాత్ర చిరస్మరణీయం.?అయితే, 2023లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితులు అనూహ్యంగా మారాయి. ప్రజాస్వామ్య విలువల పరిరక్షణే ధ్యేయంగా ఏర్పడిన ప్రభుత్వం, రాజకీయ అవసరాల కోసం ఫిరాయింపులను ప్రోత్సహించడం జీవన్ రెడ్డి వంటి సిద్ధాంతకర్తలకు మింగుడుపడని అంశంగా మారింది. ముఖ్యంగా జగిత్యాల నియోజకవర్గంలో బీఆర్ఎస్ నుంచి గెలిచిన ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌ను పార్టీలోకి ఆహ్వానించడం, ఆయనకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వడం పుండు మీద కారం చల్లినట్లయింది. దశాబ్దాలుగా పార్టీని నమ్ముకుని, ప్రత్యర్థుల దాడులను తట్టుకుని నిలబడిన కార్యకర్తలను విస్మరించి, పార్టీ మారిన వారికి పెద్దపీట వేయడం వల్ల పార్టీ అంతర్గత నిర్మాణం కుప్పకూలుతోందని ఆయన ఆవేదన చెందారు. గాంధీ భవన్‌లో జరిగిన కీలక సమావేశానికి ఫిరాయింపు ఎమ్మెల్యేలను ఆహ్వానించడం, చట్టసభల్లో అనర్హత వేటు అంశం పెండింగ్‌లో ఉన్నప్పుడే వారికి ప్రాధాన్యత కల్పించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని ఆయన బలంగా నమ్మారు. "జై సంవిధాన్" అని నినదించే పార్టీ, రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ ఆశయాలను తుంగలో తొక్కడం ఆయనను తీవ్రంగా కలచివేసింది. మున్సిపల్ ఎన్నికల అభ్యర్థుల ఎంపికలో సైతం పాత కార్యకర్తలను కాదని, కొత్తగా వచ్చిన వారి మాటకే విలువ ఇవ్వడం వల్ల పార్టీలో ప్రజాస్వామ్యం కనుమరుగవుతోందనే విమర్శలు వ్యక్తమయ్యాయి. దీనికి తోడు, పార్టీ పట్ల ఎంతో నిబద్ధత కలిగిన మారుగంగారెడ్డి అనే జీవన్ రెడ్డి అనుచరుడు దారుణ హత్యకు గురికావడం, జీవన్ రెడ్డిని తీవ్ర మానసిక క్షోభకు గురిచేశాయి. తనను నమ్ముకున్న కార్యకర్తలకు రక్షణ కల్పించలేనప్పుడు పదవుల్లో కొనసాగడం నిరర్థకమని భావించిన ఆయన, తన 40 ఏళ్ల రాజకీయ ప్రస్థానానికి స్వస్తి పలకాలని నిర్ణయించు కున్నారు.?రాజీవ్ గాంధీ ప్రవేశపెట్టిన పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం యొక్క అసలు స్ఫూర్తిని ప్రస్తుత రాజకీయ నాయకత్వం విస్మరించడం వల్లనే ఇటువంటి అవాంఛనీయ పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. రాహుల్ గాంధీ జాతీయ స్థాయిలో 'న్యాయ్' యాత్రల ద్వారా విలువలతో కూడిన రాజకీయాల గురించి మాట్లాడుతుంటే, రాష్ట్ర స్థాయిలో అందుకు విరుద్ధంగా జరుగుతున్న పరిణామాలు పార్టీ విశ్వసనీయతను దెబ్బతీస్తున్నాయి. జీవన్ రెడ్డి రాజీనామా అనేది కేవలం ఒక వ్యక్తి నిష్క్రమణ కాదు, అది అధికారం కోసం నైతికతను పణంగా పెట్టే రాజకీయ ధోరణిపై జరిగిన ఒక నైతిక పోరాటం. పార్టీలో క్రమశిక్షణ, కార్యకర్తల ఆత్మగౌరవం, మరియు సిద్ధాంతాల పట్ల స్పష్టత లేకపోతే ఎంతటి ప్రజాదరణ ఉన్నా అది స్వల్పకాలికమే అవుతుందని ఈ ఘటన హెచ్చరిస్తోంది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం స్థిరంగా కొనసాగాలంటే ప్రజా సంక్షేమ పథకాలతో పాటు, క్షేత్రస్థాయిలో పార్టీని నమ్ముకున్న నాయకులకు, కార్యకర్తలకు సముచిత గౌరవం కల్పించాల్సిన బాధ్యత అధిష్టానంపై ఉంది. జీవన్ రెడ్డి వంటి మేధావి, నిబద్ధత కలిగిన నాయకుడు దూరం కావడం కాంగ్రెస్ పార్టీకి కోలుకోలేని దెబ్బ. ఇది రాజకీయ పక్షాలన్నింటికీ ఒక ఆత్మపరిశీలన సమయం. పార్టీ ఫిరాయింపులు, అధికార రాజకీయాల కంటే ప్రజాస్వామ్య విలువలు, కార్యకర్తల శ్రేయస్సు మిన్న అని చాటిచెప్పిన జీవన్ రెడ్డి నిర్ణయం, రాబోయే రోజుల్లో తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో పెను మార్పులకు నాంది కావచ్చు. పార్టీ వ్యవస్థను బలోపేతం చేసుకోవడంలో విఫలమైతే, ప్రజల్లో ఉన్న నమ్మకాన్ని కోల్పోయే ప్రమాదం ఉందని ఈ పరిణామం స్పష్టం చేస్తోంది. ఒక గొప్ప రాజకీయ యుగానికి ముగింపు పలకడం కంటే, ఆ వ్యవస్థలోని లోపాలను సరిదిద్దుకుని ముందుకు సాగడమే నిజమైన రాజకీయం.ప్రస్తుత పరిస్థితుల్లో జీవన్ రెడ్డి తీసుకున్న ఈ కఠిన నిర్ణయం తెలంగాణ సమాజంలో రాజకీయ నైతికతపై చర్చను పునఃప్రారంభించింది. విలువలకు ప్రాధాన్యత ఇచ్చే ఓటర్లు, విద్యావంతులు ఈ పరిణామాన్ని నిశితంగా గమనిస్తున్నారు. పార్టీలు మారడం అనేది కేవలం సాంకేతిక అంశం కాదు, అది ప్రజలు ఇచ్చిన తీర్పును ధిక్కరించడమేనని జీవన్ రెడ్డి వాదనలో స్పష్టత కనిపిస్తోంది. అధికారం శాశ్వతం కాదని, వ్యక్తిత్వం మరియు విలువలే రాజకీయాల్లో చిరస్థాయిగా నిలుస్తాయని ఆయన తన రాజీనామా ద్వారా చాటిచెప్పారు. కాంగ్రెస్ పార్టీ నాయకత్వం ఇప్పటికైనా మేల్కొని, క్షేత్రస్థాయిలో ఉన్న అసంతృప్తిని చల్లార్చకపోతే, భవిష్యత్తులో మరిన్ని ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుంది. ప్రజాస్వామ్యాన్ని కాపాడతామని వాగ్దానం చేసిన వారు, స్వయంగా ఆ విలువలను కాలరాస్తున్నారనే ముద్ర పడకుండా జాగ్రత్త పడాలి. చివరగా, జీవన్ రెడ్డి రాజీనామా తెలంగాణ రాజకీయ చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోతుంది, ఇది పదవుల కంటే సిద్ధాంతాలే గొప్పవని నమ్మే ప్రతి రాజకీయ కార్యకర్తకు ఒక ప్రేరణగా మిగిలిపోతుంది.

**-రామకిష్టయ్య సంగనబట్ల, సీనియర్ జర్నలిస్టు**

# ఇల్లందకుంట శ్రీ సీతారామ కళ్యాణానికి అన్ని ఏర్పాట్లు పూర్తి

**చురకలు ప్రతినిధి, హుజురాబాద్, మార్చి 26 :** అపర భద్రాద్రిగా పేరు గాంచిన శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో జరిగే కళ్యాణానికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, వేసవి కాలం దృష్టిలో ఉంచుకొని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చలవపందిళ్ళు, మంచి నీటి వసతి కల్పించామని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్



తెలిపారు. ఇల్లందకుంట మండల కేంద్రంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయాన్ని అయన గురువారం సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కరీంనగర్ జిల్లా అడిషనల్ కలెక్టర్ లక్ష్మి కిరణ్, హుజూరాబాద్ ఆర్డీఓ రమేష్, ఆలయ ఈఓ సుధాకర్, చైర్మలన్ రామారావు, డైరెక్టర్లు, స్థానిక అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కళ్యాణానికి సుమారు లక్ష మంది హాజరవుతారని, జమ్మికుంట నుండి ఇల్లందకుంట వరకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామన్నారు. జమ్మికుంట మిల్లర్లు ఆధ్వర్యంలో ఉచిత మహా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామనితెలిపారు. కళ్యాణానికి రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరై ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పిస్తారని తెలిపారు. కళ్యాణానికి వచ్చే వాహనదారులకు పార్కింగ్ సంబంధించి పోలీసు శాఖ అధికారులు ఇప్పటికే మార్కింగ్ ఇచ్చారని అందరి సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, మండల అధ్యక్షుడు పెద్ది కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వేసవి అయినందున భక్తులకు మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు.

# చల్లగా...ప్రాణాలతో చలగాటం?

**- గ్రామాల్లో కల్తీ ఐస్ క్రీమ్ ఉద్యమం**
**- నిబంధన ఫ్లెక్సీల ఏర్పాట్లు,అతిక్రమిస్తే జరిమానా**
**- కల్తి విక్రయాలను పట్టించుకోని అధికారులు**




**చురకలు విలేకరి ఇబ్రహింపట్నం మార్చి (26) :** వేసవికాలంలో చల్లని పదార్థాలు తిసుకుంటే ఎంతో హయిగా ఉంటుంది. కాని కల్తి అయిన చల్లని పదార్థాలు సెవిస్తె ఆరోగ్యం పాడు కావటం మాత్రం తప్పదు మరి.ప్రజల ఆరోగ్యం దృష్టి లో పెట్టకుని గ్రామలలో గ్రామపంచాయతీ, అభివృద్ధి కమిటీ లు గ్రామనికి నాసిరకం ఐస్ క్రిం లు విక్రయింస్తె జరిమానా విదిస్తామని హెచ్చరిక బోర్డు, ఫ్లెక్సీ లను ఎర్పాటు చేయటం చర్చనీయాంశంగా మారింది. ఐస్ క్రీమ్ అంటే ఇష్టపడని వారు ఉండరు. చిన్న, పెద్ద అనే తేడా లేకుండా అంతా ఐస్ క్రీమ్స్ ని ఇష్టపడుతారు.వేసవికాలం కావటం తో ఐస్ క్రీమ్స్‌కి మరింత డిమాండ్ పెరిగింది.మండుటెండల్లో చల్లనల్లని ఐస్ క్రీమ్ తింటే మనసుకు హాయినిస్తుంది,పిల్లలు అడిగారని వెంటనే ఐస్‌క్రీమ్ కొనిచ్చారో ఇక అంతే సంగతులు.ఆరోగ్యం పాలిట శాపంగా మారుతోంది.ఎందుకంటే,కాసుల కకుర్తితో కొందరు కేటుగాళ్లు ఐస్ క్రీమ్ లను కల్తీ చేస్తున్నారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు. ప్రజల ప్రాణాలను పణంగా పెట్టి తమ జేబులు నింపుకుంటున్నారు.నాణ్యతా ప్రమాణాలు పాటించకపోగ,ఆపరిశుభ్ర వాతావరణం.హానికారమైన, ప్రమాదకర కెమికల్స్ వినియోగం చాలా చోట్ల జరుగుతున్న తంతు. పైనేమో బ్రాండెడ్ ఐస్ క్రీమ్ కంపెనీ లేబుల్స్ ఉంటాయి. లోనేమో నాసిరకపు సరుకు ఉంటుంది. ఎవరికీ ఎలాంటి అనుమానం రాకుండా కల్తీ చేసిన ఐస్‌క్రీమ్స్‌ను మార్కెట్‌లో అమ్మేస్తున్నారు.మోసగాళ్లు వివిధ బ్రాండ్ల పేరుతో అమ్ముతున్న ఐస్‌క్రీమ్ తయారీలో కేటుగాళ్లు కల్తీ చేస్తున్నారు. అక్రమార్జన కోసం వక్రమార్గాలు పడుతున్నారు.గతంలో తెలంగాణలో పలు చోట్ల కల్తీ ఐస్ క్రీమ్ కలకలం రేగింది.ప్రజల ఆరోగ్యం తో చలగాటం అడుతు కల్తీ ఐస్ క్రిం నిర్వహకులు లక్షలలో డబ్బులు పోగేసుకుంటున్నారు.

**కల్తీ లపైన చర్యలు తీసుకునేది ఎవరు..?**

పట్టణంతో పాటు పలు ప్రాంతాల్లో నాణ్యత లేని ఐస్‌క్రీమ్‌లు విచ్చల విడిగా విక్రయిస్తుంటే సంబంధిత అధికారులు మాత్రం ఈ ఐస్ క్రీమ్ తయారీదారుల పై చర్యలు తీసుకోవడంలేదని విమర్శలు వినిపిస్తున్నాయి.నాణ్యతప్రామణాలను పాటిస్తున్న హోటళ్లలో ఏదో ఒక వంక పేరుతో సీజ్ చేసే నాణ్యత లేని ఐస్ క్రీమ్ లు విక్రయిస్తున్నా వారిపైన ఆహరతనిఖీ అదికారులు చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు.

**గ్రామాల్లో కల్తీ ఐస్ క్రీమ్‌లపై ఉద్యమం**

కల్తీ ఐస్ క్రీమ్‌లు తిని పిల్లలు వ్యాధుల బారిన పడుతున్నారని,కల్తీ ఐస్ క్రీమ్‌లపై అధికారులు చర్యలు తీసుకోకపోయినా తామే ముందుండి కల్తీ ఐస్‌క్రీమ్‌లను తమ గ్రామానికి రాకుండా చూస్తామని,గ్రామాల ప్రజలు, పాలకవర్గం కలసి ఐస్ క్రీమ్ బండ్లను తమ గ్రామాల్లోకి రావద్దని వస్తె ఐదు వేల రూపాయలు జరిమానా విధిస్తామని ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఈ ఫ్లెక్సీలు ఇప్పుడు చర్చనీయాంశం అవ్వగా ఈ ఫ్లెక్సీలను చూసైన అధికారులు స్పందించి కల్తీ ఐస్ క్రీమ్ ల పై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవాలు చేసుకోవాలి

**-జిల్లా మాత శిశు సంరక్షణ అధికారి డాక్టర్ జయపాల్ రెడ్డి**

**చురకలు విలేకరి ఇబ్రహింపట్నం మార్చి (26) :** ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసావాలు చేసుకోవాలని జగిత్యాల జిల్లా మాత శిశు సంరక్షణ అధికారి డాక్టర్ జయపాల్‌రెడ్డి అన్నారు.గురు వారం ఇబ్రహింపట్నం మండల కేంద్రం లోనిప్రాథమిక ఆరోగ్య కేంద్రంను శిశు సంరక్షణ అధికారి డాక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా అయాన మాట్లాడుతూ తల్లులను ఆరోగ్య కేంద్రంతో అందుతున్న సేవలగురించి అడిగి తెలుసుకున్నారు.గర్భిణీ స్త్రీలకు పరీక్షలు నిర్వహించారు.అనంతరం గర్భిణీ స్త్రీలతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవం చేసుకోవాలని, అన్నిరకాల వసతులు ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్నాయని,సాధారణ కాన్పు వల్ల కలిగే లాభాలు తల్లిపాల ప్రాముఖ్యత,వ్యాధి నిరోధక టీకాలు తదితర విషయాల గురించి వివరిం చారు.ఆసుపత్రిలోని ల్యాబ్‌లో నిర్వహి స్తున్న పరీక్షలు,డ్రగ్స్ స్టోర్ రూమ్, వ్యాక్సిన్ స్టోర్ రూమ్, ఓపి మొదలైన



వాటినీ పరిశీలించారు.ఈ కార్యక్రమం లో డాక్టర్ ఎల్ వనజ,సిహెచ్‌ఓ విజయ భాస్కర్, సూపర్వైజర్లు, నర్సింగ్ ఆఫీసర్స్, ఫార్మసిస్ట్, లాబ్ టెక్నీషియన్, ఏఎన్ఎం , ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుంది

**-జగిత్యాలజిల్లా విద్యాధికారి రాము**

**చురకలు విలేకరి ఇబ్రహింపట్నం మార్చి (26) :** ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని జగిత్యాలజిల్లా విద్యాధికారి రాము అన్నారు. గురువారం ఇబ్రహీంపట్నం మండలంలోని కోజన్ కొత్తూరు ఉన్నత పాఠశాలలను జిల్లా విద్యాధికారి రాము సందర్శించారు. ప్రభుత్వ పాఠశాలలో మాత్రమే నాణ్యమైన విద్యాబోధన అందుతుందన్నారు. ఈ పాఠశాల నుండి ఇటీవల విడుదలైనటువంటి జవహర్ నవోదయ



2026 ఫలితాలలో జిల్లాస్థాయిలో ఐదవ ర్యాంకు సాధించినటువంటి ముత్యాల మిధున ను విద్యాధికారి రాము,మండల విద్యాధికారి మధు ఇబ్రహీంపట్నం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం. రాజన్న అభినందించి మెమొంటోలను అందించారు. నవోదయ సీటు తోటి విద్యార్థులందరికీ ప్రేరణగా ఉందని విద్యార్థులందరూ కూడా ఇదే విధంగా విద్యలో అత్యున్నత ప్రతిభ కనబరిచి గ్రామానికి, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు.అలాగే మండల విద్యాధికారి మధు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య ప్రతి విద్యార్థికి అందేలా ప్రభుత్వం కృషి చేస్తుందని , విద్యతో పాటు మధ్యాహ్న భోజనం, పాఠ్యపుస్తకాలు మొదలగునవి ప్రభుత్వం అందిస్తుందన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయుల సేవలను తల్లిదండ్రులు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శోభారాణి ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పలువురి నాయకులకు సురభి నవీన్ పరామర్శ



**చురకలు విలేకరి ఇబ్రహింపట్నం మార్చి (26) :** జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం మండలంలోని వేములకుర్తి గ్రామంలో బిజెపి 9వ బూత్ అధ్యక్షులు సున్నం రాజేష్ తండ్రి మాజీ ఉపసర్పంచ్ సున్నం దశరథం ఇటీవల శస్త్రచికిత్స కావడం,కాంగ్రెస్ సినియర్ నాయకులు నాంపల్లి వెంకటాద్రి అనరోగ్యంతో బాదపడుతుండగా ఇరువురిని గురువారం బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోరుట్ల నియోజకవర్గ నాయకులు సురభి నవీన్‌కుమార్ పరామర్శించారు.అయన వెంట బిజెపి బిజేవైఎం నాయకులు కోటగిరి వెంకటస్వామి,మాలేపు శ్రీనివాస్,అరె రాకేష్,పోన్నం గణేష్,తోట బన్ని కార్యకర్తలు పరామర్శించారు.

## శిక్షణ పొందిన వార్డు సభ్యులకు సర్టిఫికెట్ పంపిణీ



**చురకలు విలేకరి ఇబ్రహింపట్నం మార్చి (26) :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని మండల పరిషత్ కార్యాలయం లో నూతనముగా ఎన్నికైన గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు లకి 5 రోజుల ఓరియెంటేషన్ శిక్షణ కార్యక్రమంలో శిక్షణ పూర్తి చేసుకున్నటువంటి వార్డు మెంబర్ లకి సర్టిఫికెట్ లని అందించారు.ఈసందర్భంగా ఇబ్రహింపట్నం ఎంపిడిఓ రామక్రిష్ణ మాట్లాడుతూ పంచాయతీ రాజ్ చట్టం లోని అన్ని విషయాల గురించి ప్రతి వార్డు సభ్యులకి అవగాహన కోసం వచ్చిన వార్డు మెంబర్ లకి మాస్టర్ ట్రైనర్ రాకేష్, రమేష్,రాజ శేఖర్,రవిలు ట్రైనింగ్ ఇచ్చారన్నారు. మొదటి బ్యాచ్ లో అమ్మకపేట,ఎర్రాపూర్,డబ్బా,వర్షాకొండ, కోమటి కొండపూర్, కేశాపూర్, కోజన్ కొత్తూరు, ఇబ్రహీంపట్నం గ్రామాల వార్డు మెంబర్ లు మొత్తం 79 మంది ట్రైనింగ్ పోందరన్నారు. శిక్షణ పోందిన వారికి సర్టిఫికెట్ లను అందచేశారు.ఈ కార్యక్రమము లో మండల పంచాయతీ అధికారి మహేశ్వర రెడ్డి, సీనియర్ సహాయకులు లక్ష్మయ్య, ఎపియం శంకర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కోటిలింగాలను సందర్శించిన దేవాదాయశాఖ అధికారులు



**చురకలు,విలేఖరి, వెల్గటూర్,మార్చి 26 :** రాబోయే 2027 సంవత్సరంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించతలపెట్టిన గోదావరి పుష్కరాల సందర్భం గా జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం కోటిలింగాల గోదావరి,కోటేశ్వరస్వామి ఆలయా న్ని గురువారం దేవాదాయశాఖ స్థపతి వల్లి నాయగం,ఆర్క్ టెక్ శ్రీమతి మాదవిలు సందర్శించి చేపట్టవలసిన అభివృద్ధిపనుల గురించి సమీక్షించారు. గోదావరినది వద్ద స్నానఘాట్లను పరిశీలించి,దేవాలయ రాజగోపురం, ఆలయం చుట్టూ ప్రాకార మండప నిర్మాణం,భక్తులకు వసతి గదుల నిర్మాణం తదితర అభివృద్ధి పనులగురించి సమీక్షించారు.ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ ఏ ఈ సంతోష్ రెడ్డి,ఆలయ కార్యనిర్వాహణాధికారి కాంతారెడ్డి,అర్చకులు పాల్గొన్నారు.

# బాల్యం దశ దిశా నిర్దేశకులు ఉపాధ్యాయులే

**-కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు**
**ముస్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంత గంగాధర్**



**చురకలు ప్రతినిధి కోరుట్ల మార్చి 26 :** బాల్యం దశలో విద్యార్థుల భవిష్యత్తుకు దిశా నిర్దేశం చేసే వారు ఉపాధ్యాయులేనని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు కోరుట్ల ముస్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంత గంగాధర్ అన్నారు.కోరుట్ల పట్టణంలోని హాజీపుర ప్రభుత్వ ప్రాథమిక ఉర్దూ మీడియం పాఠశాలలో బుధవారం సాయంత్రం వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారు విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించి ప్రశంసించారు ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి గంగుల నరేశం పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు తిరుమల గంగాధర్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు కొంతం రాజం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పెరుమాండ్ల సత్యనారాయణ కౌన్సిలర్లు వాసిద్ సోగ్రాభి బాబా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు విద్యార్థులు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# లక్కీ డ్రా పేరుతో మోసం

**-ఇద్దరు నిందితులపై కేసు నమోదు**
**-వివరాలు వెల్లడించిన ధర్మపురి సీఐ**



**చురకలు, విలేఖరి, వెల్గటూర్, మార్చి 26 :** జగిత్యాల జిల్లా వెల్గటూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాజారాంపల్లి లో లక్కీ డ్రా పేరుతో కూపన్ లను విక్రయిస్తున్నట్లు ముందస్తు సమాచా రం మేరకు ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి, వారివద్ద లక్కీ డ్రా కోపన్లు,85వేల నగదు,సెల్ ఫోన్లు,రిజిస్టర్‌లు స్వాదీనం చేసుకొని కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గురువారం వెల్గటూర్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ధర్మపురి సీఐ రాం నర్సింహారెడ్డి వివరాలు వెల్లడించారు. ధర్మారం మండలం నంది మేడారంకు చెందిన కట్ట రమేష్,41,ఎర్రగుంటపల్లె కు చెందిన కల్లెం నరెందర్ 33,లు ఇద్దరు కలిసి సులువుగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో మా అవసరం,మీ అదృష్టం పేరుతో లక్కీ డ్రా స్కీం పెట్టి కోపన్లు విక్రయసూ్త డబ్బులు వసూలుచేసి ప్రజలను మోసం చేసి స్వంత అవసరాలు తీర్చుకోవాలని పథకం వేసినట్లు,గెలుపొందిన వారికి ప్రథమ బహుమతి క్రింద కియా కేరెన్స్ 7 సీటర్ కారు,టివిఎస్ బైక్, ఎలక్ట్రానిక్ బైక్,వాషింగ్ మిషన్,25 వేల నగదు, పది మందికి ఒక్కొక్కరికి 10వేల నగదు బహుమతులిస్తామని ఒక్కో కోపన్‌కు 1116, రుసుముతో 3వేలకూపన్లు విక్రయంచి,వచ్చేనెల 3నడ్రా తీయడానికి నిర్ణయించారు.రాష్ట్రంలో నిషేదించబడ్డ లక్కీ డ్రాస్కీం పేరుతో కూపన్లను బుధవారం రాజారాంపల్లిలో విక్రయి స్తున్న సమాచారంతో రమేష్,నరేందర్ లను పట్టుకొని కేసు నమోదుచేసి నట్లుధర్మపురి సీఐ రాంనర్సింహా రెడ్డి తెలిపారు.లక్కీ డ్రా పేరుతో ప్రజలను మోసంచేసి డబ్బులు వసూలు చేస్తే చట్టరీత్యా చర్యలు ఉంటాయని ఇలాంటి మోసపూరిత ప్రకటనలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్ర మంలో వెల్గటూర్ ఎస్సైఉదయ్ కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# నయనానందకరం సీతారామ కళ్యాణం

**రామ కిష్టయ్య సంగన భట్ల...**

ధర్మపురి పట్టణంలో గురు వారం రామజన్మోత్సవ, రామ కల్యాణోత్సవ వేడుకలు వైభవో పేతంగా, కన్నుల పండువగా జరిగాయి. ధర్మపురి క్షేత్రంలో గోదావరి తీరాన వెలసిన శ్రీరామాలయంలో ఉదయం శ్రీరామ జన్మోత్సవ ప్రత్యేక పూజలు నిర్వ హించారు.దేవస్థాన వంశపారంపర్య అర్చకులు తాదూరి బాలకిష్టయ్య శర్మ, బలరామ శర్మ, బాలచంద్రశర్మ, రఘునాథ శర్మ, బాల మోహన్ శర్మ, మోహన్ శర్మ, వామనశర్మ, రామశర్మ, శరచ్చంద్ర శర్మ, ఆశ్రిత్ శర్మ, విలోక్ శర్మ,భరత్‌శర్మల ఆధ్వర్యంలో విధివిధాన వేదోక్త సంప్ర దాయ పూజలొ నరించారు.కల్యాణోత్సవం సందర్భంగా స్వస్తి పుణ్యాహ వాచనం,వామదేవ శతానంద రుత్విగ్వరణం,కళ్యాణార్థం వివాహ వేదిక ప్రవేశం,శ్రీరామచంద్ర వరునికై కన్యా న్వేషణ,సీతారామ వంశావళి ప్రవరలు,మధుపర్క ప్రాశనం, సముహూర్త,మంగళ సూత్ర ధారణం, అక్ష తారోపణం,వివాహానంతర లఘు పూజ,నైవేద్యం,మహామంత్ర పుష్పం, దేవతాశీర్వచనం తదితర ప్రత్యేక కార్య క్రమాలను నిర్వహించారు. సర్వాలంకార శోభితులై,పుష్ప మాలాలంకృతు లైన



శ్రీరామచంద్రునికి,పరమపావని యైన లోకమాత సీతాదేవికి లోకకల్యా కల్యాణార్థం అభిజిత్ లగ్న శుభ ముహూ ర్తంలో మధ్యాహ్నం మూల విరాట్టులకు జరిపించిన కల్యాణ మహోత్సవానికి వేలాదిమంది భక్తులు హాజరై కన్నులారా గాంచి తరించారు. రామాలయంలో వేదవిదులు మధు శంకరశర్మ,మధు రామశర్మ,నీలకంఠ శర్మ,బల్యపెల్లి ప్రసాద్‌శర్మ,సంగన భట్ల నర్సయ్య శర్మ,విశ్వనాథ శర్మ,పనతుల వెంకట రమణ శర్మ,కాకెరి గోపాల్ శర్మ, అనిల్ శర్మ,పెండ్యాల బాలకృష్ణ, పాత బాలచందర్,గుండి రామనాథం, సంగన భట్ల నరేందర్,పాలేపు దత్తాత్రి, గొల్లపెల్లి గుండయ్య,అలువాల దత్తాత్రి, సంగన భట్ల లక్ష్మీ కాంతన్న,ఓజ్జల ప్రవీణ్ శాస్త్రి,, ఇందారపు లక్ష్మీ కాంత్ శర్మ, శంకర్, కొరిడే శంకర్, తదితరులు కల్యాణోత్సవాన్ని జరిపించారు.

**పట్టు వస్త్రాల సమర్పణ**

ధర్మపురి దేవస్థానం పక్షాన ముత్యాల తలంబ్రాలు పట్టువస్త్రాలు ప్రతి సంవత్సరము వలె ఈ సంవత్సర ముకూడ అందజేయటం జరిగింది. దేవస్థానం ముఖ్య అర్చకులు నంభి శ్రీనివాసాచార్యులు,బొజ్జా సంతోష్, సూపరింటెండెంట్ కిరణ్,సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, తిరు పతి,దేవయ్య,వంశీ పాల్గొన్నారు.

**లక్ష్మీ నరసింహ కాలనీలో**

ధర్మపురి పట్టణంలో శ్రీలక్ష్మీ నరసింహ స్వామి కాలనీలో నిర్మితమైన శ్రీరామాలయంలో వేద పండితులు, కమిటీ నేతృత్వంలో ఉదయం నుండి వేదోక్త స్మార్త సంప్రదాయరీతిలో ప్రత్యేక పూజలు,శ్రీరామునికి,సీతాదేవికి లోకకల్యాణార్థం కల్యాణ మహోత్సవానికి జరిపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

**దేవస్థానంలో..**

ధర్మపురి శ్రీలక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో సీతారామ, లక్ష్మీ నరసింహ స్వాముల కల్యాణ వేడుకలు ఒకే వేదికపై ఒకే మహూర్తాన శు క్రవారం నిర్వహించ నున్నారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి సంకటాల శ్రీనివాస్, వేదపండితులు బొజ్జ రమేష్ శర్మ, ముఖ్య అర్చకులు నంభి శ్రీనివాసాచార్యులు, అర్చకులు నంభి అరుణ్ కుమార్, చక్రపాణి కిరణ్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అర్చకులు సిబ్బంది తగిన ఏర్పాట్లు చేస్తున్నారు.

**సాయి జన్మ దిన వేడుకలు**

ధర్మపురి క్షేత్రస్థ గోదావరీ నదీ తీరస్థ శ్రీసాయి బాలాజీ మందిరంలో సాయిబాబా జన్మదిన వేడుకలు వైభవంగా జరిగాయి. ఆలయ వ్యవస్థాపక నిర్మాత ఒజ్జల ప్రవీణ్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో, ట్రస్టు అధ్యక్షుడు గోలి రాంప్రసాద్ నిర్వహణలో, అర్చకులు, స్థానిక వేద పండితులు ఆకర్ష్ శర్మ, అక్షయ్ శర్మలు, ప్రత్యేక పూజలు, జన్మదిన అర్చనలు నిర్వహించారు. మహా క్షీరాభిషేక కార్యక్రమంలో అశేష భక్తజనులు స్వహస్తాలతో, సాయి నాథున్ని క్షీరాభిషిక్తుడిని చేసి తరించారు. ఈ సందర్భంగా నివేదనలు సమర్పించారు.

## వైద్య ఖర్చులకు ఎన్ఆర్ఐల ఆర్థిక సాయం



**చురకలు విలేకరి,ధర్మపురి,మార్చి 26 :** ధర్మపురి పట్టణంలోని బోయవాడకు చెందిన రంగు వెంకటేష్ గుండె, కిడ్నీ, తదితర పలు వ్యాధులతో ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా వైద్యం కోసం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న ధర్మపురి పట్టణానికి చెందిన ఎస్ఆర్ఐలు ధర్మపురి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు, మున్సిపల్ కౌన్సిలర్ చిపిరిశెట్టి రాజేష్ అతని మిత్రులు గాదాసు మనోజ్, బీర పూర్కు చెందిన ఎన్నారై చెట్టు పెల్లి సాగర్ ల సహకారంతో రూ.15000 వెంకటేష్ కుటుంబానికి అందజేశారు. మరింత మంది ముందుకు వచ్చి వెంకటేష్ను ఆదుకోవాలని వారు కోరారు.

## బిఎల్వో సస్పెండ్

**చురకలు విలేకరి, జగిత్యాల, మార్చి 26 :** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ విధుల్లో నిర్లక్ష్యం వహించిన బిఎల్వో తూకుంట్ల పద్మను సస్పెండ్ చేస్తూ గురు వారం జిల్లా కలెక్టర్,జిల్లా ఎన్నికల అధికారి బి.సత్యప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు.స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

## లైంగికదాడి కేసులో నిందితునికి పదేళ్ల జైలుశిక్ష

**చురకలు ప్రతినిధి,జగిత్యాల,మార్చి 26 :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన మహిళపై లైంగిక దాడి, బెదిరింపుల కేసులో న్యాయస్థానం సంచలన తీర్పు వెలువరించింది. గురువారం అదనపు జిల్లా సెషన్స్ జడ్జి నారాయణ కేసును విచారించి నిందితుడికి 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.6,600 జరిమానా విధించారు. వివరాల్లోకి వెళ్తే దండేపల్లి మండలం నర్సాపూర్ గ్రామానికి చెందిన నరేండ్ల మహేందర్ (29) అనే నిందితుడు గొల్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధి కి చెందిన బాధితురాలిని గతంలో రహస్యంగా చిత్రీకరించిన వీడియోలను ఆధారంగా తీసుకొని ఆమెను బెదిరిస్తూ పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితురాలు వ్యక్తిగత గోప్యతను దుర్వినియోగం చేస్తానని సోషల్ మీడియాలో వీడియోలు విడుదల చేస్తానని నిందితుడు మహేందర్ బెదిరింపులకు పాల్పడుతూ పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలతో భయభ్రాంతులకు గురైన బాధితురాలు పోలీసులను ఆశ్రయించగా, గొల్లపల్లి పోలీస్ స్టేషన్లో కేసు నమోదు దర్యాప్తు చేసిన సర్కిల్ ఇన్స్పెక్టర్ బి. కోటేశ్వర్ సమగ్రంగా విచారణ నిర్వహించి నిందితుడిని అరెస్టు చేసి, పక్కా సాక్ష్యాధారాలతో కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరపున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ బిట్ల నర్సయ్య వాదనలు వినిపించగా, కోర్టు సాక్ష్యాధారాలను పరిశీలించి నిందితుడు నరేండ్ల మహేందర్ను దోషిగా తేల్చి 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.6600 జరిమానా విధించింది. ఈ కేసులో నిందితునికి శిక్ష పడడంలో కృషి చేసిన విచారణ అధికారి బి.కోటేశ్వర్, పిపి బిట్ల నర్సయ్య, సిఎంఎస్ ఎస్ఐ శ్రీకాంత్, కోర్టు కానిస్టేబుళ్లను జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

## హుజురాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా కేసరి శేషయ్య



**చురకలు ప్రతినిధి హుజురాబాద్ మార్చి 26 :** హుజురాబాద్ అడ్వకేట్స్ బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా కేసరి శేషయ్య ఎన్నికయ్యారు.అసోసియేషన్ ఎన్నికలు గురువారం సబ్ కోర్టు కాంప్లెక్స్ ఆవరణలో జరిగాయి.ఎన్నికల్లో అధ్యక్షునిగా కేసరి శేషయ్యతోపాటు..ప్రధాన కార్యదర్శిగా జోష్ణ దేవి, ఉపాధ్యక్షునిగా పిట్టల రాజేష్, సంయుక్త కార్యదర్శిగా లింగమూర్తి,క్రీడలు సాంస్కృతిక కార్యదర్శిగా మోరే కళ్యాణ్,జూనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్గా యాస్మిన్ ఎన్నికయ్యారు. కొత్త కార్యవర్గాన్ని పలువురు అభినందించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షునిగా ఎన్నికైన కేసరి శేషయ్య మాట్లాడుతూ.. న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని అన్నారు. తనకు విజయాన్ని కట్టబెట్టిన న్యాయవాదులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల అధికారులుగా జోజుల ప్రవీణ్ కుమార్,వెంకట్ కుమార్, కుమారస్వామి వ్యవహరించారు.

# సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కల్గి ఉండాలి

**-సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930కి ఫిర్యాదు చేయాలి**

**-సైబర్ క్రైమ్ డిఎస్పి వెంకటరమణ**




**చురకలు ప్రతినిధి, జగిత్యాల, మార్చి 26 :** సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కల్గి ఉండాలని, సైబర్ మోసలకు గురైతే వెంటనే 1930 కి ఫిర్యాదు చేయాలని సైబర్‌క్రైమ్ డిఎస్పి వెంకటరమణ అన్నారు. ఉమెన్ ఎంపవర్మెంట్ ప్రోగ్రామ్‌లో భాగంగా ప్రభుత్వ గురుకుల డిగ్రీ కళాశాలలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సైబర్ క్రైమ్ డీఎస్పీ వెంకటరమణ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థినులకు సైబర్‌భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ మహిళలు, ముఖ్యంగా విద్యార్థినులు సోషల్ మీడియా వేదికల ద్వారా జరుగుతున్న వివిధ రకాల మోసాల పట్ల అప్రమత్తం గా ఉండాలని తెలిపారు. సైబర్ స్టాకింగ్, సైబర్ బుల్లీయింగ్ వంటి సమస్యలు ఇటీవలి కాలంలో పెరుగుతున్నాయని, సోషల్ మీడియా లేదా మెసేజింగ్ యాప్స్ ద్వారా అసభ్యకరమైన సందేశాలు పంపడం, వేధించడం, బెదిరించడం వంటి చర్యలు సైబర్ నేరాల పరిధిలోకి వస్తాయని వివరించారు. ఇలాంటి ఘటనలు ఎదురైనప్పుడు భయపడకుండా వెంటనే పోలీసులకు ఫిర్యాదు. చేయాలని సూచించారు. అలాగే ఫేక్ సోషల్ మీడియా ప్రొఫైల్ ద్వారా జరుగుతున్న మోసాలపై కూడా అవగాహన కల్పించారు. ఇతరుల పేరుతో నకిలీ ఖాతాలను సృష్టించి డబ్బులు అడగడం, వ్యక్తిగత వివరాలు సేకరించడం వంటి ఘటనలు ఎక్కువగా జరుగుతున్నాయని తెలిపారు. అందు వల్ల సోషల్ మీడియాలో తెలియని వ్యక్తులతో వ్యక్తిగత వివరాలు పంచుకోవద్దని సూచించారు. విదేశాల్లో ఉద్యోగం, గిఫ్ట్ పంపిస్తున్నామని చెప్పి డబ్బులు అడిగే మోసాలకు గురికాకుండా జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. అదేవిధంగా ఫిషింగ్ లింకులు పంపించి డేటా దొంగిలించడం, ఓటీపీలు తీసుకోవడం వంటి సైబర్ మోసాల గురించి కూడా వివరించారు. సోషల్ మీడియా ఖాతాల కు బలమైన పాస్వర్డు ఉపయోగించడం, ప్రైవసీ సెట్టింగ్స్‌ను సరిచేసుకోవడం, అనుమానాస్పద లింకులను క్లిక్ చేయకపోవడం వంటి భద్రతా చర్యలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు . సైబర్ మోసాలకు గురైనప్పుడు వెంటనే 1930 హెల్ప్ లైన్ నంబర్కు కాల్ చేయాలని, ఆన్లైన్లో సైబర్ క్రైమ్ వెబ్సైట్ ద్వారా ఆన్లైన్లో కూడా ఫిర్యాదు నమోదు చేయవచ్చని తెలిపారు. బాధితులు ఆలస్యం చేయకుండా వెంటనే సమాచారం అందిస్తే మోసపోయిన డబ్బులను తిరిగి పొందే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. కార్యక్రమం అనంతరం విద్యార్థినులు అడిగిన వివిధ సందేహాల కు అధికారులు సమాధానాలు ఇచ్చారు. సైబర్ నేరాల నివారణకు ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని సూచిస్తూ విద్యార్థినులతో సైబర్ క్రైమ్ అవగాహన ప్రతిజ్ఞ చేయించారు. సైబర్ భద్రతపై అవగాహన పెంచేందుకు పోస్టర్ ప్రెజెంటేషన్ కార్యక్రమం కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎస్.ఐ ఉమాసాగర్ సైబర్ క్రైమ్ ఎస్.ఐలు కృష్ణ, దినేష్, ఎస్కెఎన్ఆర్ కళాశాల ప్రిన్సిపల్ అశోక్, గురుకుల డిగ్రీకళాశాల ప్రిన్సిపల్ శ్రీలత, కళాశాల సిబ్బంది, కళా బృంద సభ్యులు, షి టీం, బరోసా టీం సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

# అన్ని వార్డుల సమస్యల పరిష్కారానికి కృషి

**-ధర్మపురి మున్సిపల్ చైర్ పర్సన్ నాగలక్ష్మి**



**చురకలు విలేకరి, ధర్మపురి, మార్చి 26 :** ధర్మపురి పట్టణంలోని అన్ని వార్డులలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ధర్మపురి మున్సిపల్ చైర్ పర్సన్ వేముల నాగలక్ష్మి తెలిపారు. గురువారం ధర్మపురి పట్టణం లోని 7వవార్డును సందర్శించారు. వార్డులో నెలకొన్న సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. వార్డులలో ప్రధానంగా తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య సమస్యలపై సమగ్రంగా పరిశీలించి ,వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు తక్షణ సూచనలు చేసి పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు అన్ని వార్డులలో వార్డు సందర్శనలు కొనసాగుతాయని తెలిపారు. ప్రజలు తెలిపిన సమస్యలు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సహకారంతో పరిష్కారం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఇందారపు రామన్న మున్సిపల్ కమిషనర్ మామిళ్ల శ్రీనివాసరావు, కౌన్సిలర్ అయ్యోరి వేణు గోపాల్, మున్సిపల్ మేనేజర్ బాలగంగాధర్, సానిటరీ ఇన్స్పెక్టర్ చిట్యాల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

**-జగిత్యాల జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్**



**చురకలు విలేకరి, ఇబ్రహీంపట్నం, మార్చి 26 :** రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ అన్నారు. గురువారం ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలు, సదుపాయాలు, ఔషధాల లభ్యత, వైద్య సిబ్బంది హాజరు వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించారు. రోగులతో మాట్లాడి వారికి అందుతున్న చికిత్సపై వివరాలు తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని పేర్కొన్నారు. ఆసుపత్రిలో పరిశుభ్రతను కాపాడుతూ, సమయానికి వైద్య సేవలు అందించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదనంగా, అత్యవసర సేవలు ఎప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైన ఔషధాల నిల్వలు సమృద్ధిగా ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెట్ పల్లి ఆర్డీవో నరసింహారావు, డిప్యూటీ డిఎంహెచ్ఐవో జైపాల్ రెడ్డి, తహసిల్దార్, ఎంపీడీవో సంబంధిత శాఖల అధికారులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ సీతారామకళ్యాణం కాదనడం సబబు కాదు

**చురకలు విలేకరి, జగిత్యాల, మార్చి 26 :** భద్రాచలంలో శ్రీ సీతారామ చంద్రస్వామి వారి కల్యాణాన్ని సీతారాముల గోత్ర నామాలతో కాకుండా లక్ష్మి నారాయణ గోత్ర నామాలతో చేస్తున్నారని, ఇది అపచారమని స్వామి స్థిత ప్రగ్యానంద సరస్వతి అక్షేపన చెప్పినప్పటికీ ఆలయ అధికారులు పట్టించుకోవడం లేదని దీనిపై జోక్యం చేసుకోవాలని తెలంగాణ మున్నూరు కాపు సంఘ రాష్ట్ర సెక్రటరీ జెనరల్ హరి అశోక్ కుమార్, తెలంగాణ మున్నూరు కాపు యువజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆరె ధశరథం లు మంత్రి కొండా సురేఖను కోరారు. గురువారం జిల్లా కేంద్రం లో వారు విలేకరులతో మాట్లాడారు. శ్రీరామ నవమి అంటే శ్రీరాముడు పుట్టినరోజే ఆ దేవుని కళ్యాణం చేస్తారని, దీన్ని మార్పు చేసి రామ నారాయణుడి కళ్యాణం అనడం సరి కాదన్నారు. భక్త రామదాసు సీతారాముల ఆలయాన్ని నిర్మించి పూజలు చేశారని, లక్ష్మి నారాయణ ఆలయాన్ని కాదన్నారు. సీతారాముల ఆలయాన్ని పూర్తిగా లక్ష్మి నారాయణ ఆలయంగా మార్చడానికి చేసే ప్రయత్నాలు మానుకోవాలని , మున్నూరు కాపుల కుల దేవతలు సీతారామచంద్రులని, దేశ వ్యాప్తంగా ఉన్న రామ భక్తుల మనో భావాలు దెబ్బ తినకుండా ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని కోరారు. శ్రీరామ నవమిని మున్నూరు కాపుల దినోత్సవం గా జరుపుకుంటున్న సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మున్నూరు కాపులకు శ్రీరామ నవమి పండుగ, మున్నూరు కాపుల దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. ఈ సమావేశంలో మున్నూరు కాపు యువజన సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి మహేందర్, టీ బీసీ జేఏ సీ రాష్ట్ర ఉపాధ్యక్షులు చిలుక రమేష్, మెట్ పల్లి మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు వొజ్జల బుచ్చిరెడ్డి, టీ పెన్షనర్ల జిల్లా ప్రధాన కార్యదర్శి పి. హన్మంత్ రెడ్డి, జిల్లా నాయకులు పుప్పాల గంగాధర్, అడప గంగారామ్, ఆర్ ఎం పి డాక్టర్ ఆకుల నాగరాజు, దిండిగాల విఠల్, పుప్పాల నర్సింగారావు, తదితరులు పాల్గొన్నారు.

## పరామర్శించిన ఉపసర్పంచ్ వార్డ్ సభ్యులు



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ మార్చి 26 :** మృతుని కుటుంబాన్ని కమాన్ పూర్ ఉపసర్పంచ్ రఫిక్ సోహెల్ మరియు వార్డు సభ్యులు గురువారం పరామర్శించారు. ఉమ్మడి కమాన్‌పూర్ మండల మాజీ ఎంపీపీ మల్యాల రామచంద్రం గౌడ్ చిన్న కుమార్తె పడాల సుప్రజ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబాన్ని బంధువులను పరామర్శించి సుప్రజ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. వారితో పాటు కమాన్ పూర్ గ్రామ వార్డు సభ్యులు మిట్ట సందీప్, గుంజపడుగు నవీన్, పచ్చునూరి రాజ్ కుమార్ , మెరుగు కుమార్, గోడిశెల లింగస్వామి, తూటి రాజు , మరియు గొట్టె సంపత్, అంబీర్ రవి తదితరులు పాల్గొన్నారు.

## రక్తదాతకు అవార్డు



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ మార్చి 26 :** రామగుండం కార్పొరేషన్ లోని ఎనిమిదవ కాలనీకి చెందిన కట్కూరి శంకర్ రక్తదాతకు వసుంధర విజ్ఞాన వికాస మండలి వారు అవార్డును హైదరాబాద్లో గురువారం అందజేశారు. వసుంధర విజ్ఞాన వికాస మండలి 26వ వార్షికోత్సవం సందర్భంగా హైదరాబాదులోని రవీంద్రభారతిలో జరిగిన వసుంధర విజ్ఞాన వికాస మండలి వార్షికోత్సవంలో 24 సార్లు రక్తదానం చేసినందుకు బ్లడ్ డోనర్ ఐకానిక్ జాతీయ అవార్డును మాజీ ఎమ్మెల్యే కొరుగంటి చందర్, వండర్ బుక్ రికార్డ్ కోఆర్డినేటర్ బింగి నరేందర్ చేతుల మీదుగా అవార్డు అందుకోవడం జరిగిందిఅందుకోవడం జరిగింది.

# భద్రాద్రి తరహాలో కరీంనగర్ మహాశక్తి ఆలయంలో...

### -సీతారామచంద్రుడి పెళ్ళికి పెద్ద ఎత్తున తరలిరావాలని కేంద్ర మంత్రి పిలుపు



**చురకలు ప్రతినిధి కరీంనగర్ మార్చి 26 :** తెలుగు రాష్ట్రాల్లో శ్రీరామ నవమి వేడుకలు పేరు వినగానే ఠక్కున భద్రాచలం గుర్తుకొస్తుంది.అత్యంత అంగరంగ వైభవంగా భద్రాద్రిలో శ్రీ సీతారామచంద్రస్వామి దంపతుల పెళ్లి వేడుకలు జరుగుతాయి.వేలాది మంది భక్తులు ఆ పెళ్లి వేడుకలను స్వయంగా వీక్షించేందుకు ఎందను సైతం లెక్క చేయకుండా భద్రాద్రి వెళతారు. ఇప్పుడు భద్రాద్రి తరువాత ఆ తరహాలో సీతారామచంద్రస్వామి వేడుకలు జరిపేందుకు కరీంనగర్ వేదికగా మారింది. సాధారణ ప్రజలు నిర్వహించే పెళ్లి వేడుకల తరహాలోనే కరీంనగర్ లో రామయ్య, సీతమ్మ పెళ్లి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ శ్రీకారం చుట్టారు. హంపి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విద్యారణ్య భారతి స్వామీజీ ఆశీస్సులతో ముగ్గురమ్మలు కొలువైన శ్రీ మహాశక్తి ఆలయాన్ని రామయ్య, సీతమ్మ పెళ్లి వేడుకల కోసం అత్యంత సుందరంగా ముస్తాబు చేస్తున్నారు.

**చలువ పందిలు ...తప్పట్లు..తాళాలు..తలంబ్రాలు రెడీ**

పెళ్లంటే పందిళ్లు, తప్పట్లు, తాళాలు, తలంబ్రాలు అనే నానుడిని నిజం చేస్తూ అమ్మవారి ఆలయంలో పెద్ద ఎత్తున చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు.ఇక తప్పట్లు, తాళాలు సరేసరి. ఒకేసారి 25వేల మంది భక్తులు ప్రత్యక్షంగా వీక్షించేలా ఎల్ ఈడీ స్క్రీన్లను అమర్చారు.సీతారామచంద్ర స్వామి పెళ్లి వేడుకలకు హాజరయ్యే భక్తులందరికీ వేద పండితుల ఆశీర్వచనంతోపాటు తలంబ్రాలను అందజేయనున్నారు. ఉదయం 9 గంటలకు సీతారామచంద్రుడి పెళ్లి వేడుకలు ప్రారంభం కానున్నాయి. వేడుకలు నిర్వహించే అర్చకులు సామాన్యులకు సైతం అర్థమయ్యేలా ఒక్కో ఘట్టాన్ని వివరించనున్నారు. మధ్య మధ్యలో స్వామి వారికి గాన సేవ చేస్తారు.

**విశాలమైన పెళ్లి పందిరి...తీరొక్క పూలతో అలంకరణ**

రామయ్య-సీతమ్మ పెళ్లి వేడుకల కోసం శ్రీ మహాశక్తి ఆలయాన్ని అత్యంత సుందరంగా పూలతో ముస్తాబు చేస్తున్నారు.తీరొక్క పూలతో దేవాలయాన్ని సుందరంగా అలంకరిస్తున్నారు.విద్యుత్ కాంతులతో ధగధగలాడేలా ఆలయాన్ని అందంగా తీర్చిదిద్దుతున్నారు.విశాలమైన పెళ్లిపందిరిని ఏర్పాటు చేసిపూలతో అలంకరిస్తున్నారు.

**కూలర్లు, మజ్జిగ, మంచినీళ్ల సిద్ధం..**

ఎండాకాలం కావడంతో నవమి వేడుకలకు హాజరయ్యే భక్తులకు, చిన్నారులు ఎలాంటి ఇబ్బంది పడకుండా ఉండేందుకు కూలర్లను ఏర్పాటు చేస్తున్నారు. వచ్చే ప్రతి ఒక్క భక్తుడి దాహార్తిని తీర్చేందుకు మంచి నీళ్ళు, మజ్జిగను అందుబాటులో ఉంచారు.

**25 వేల మందికి సరిపడా ఘుమఘుమలాడే వంటకాలు రెడీ**

శ్రీ మహాశక్తి ఆలయంలో సీతమ్మ-రామయ్య పెళ్లి వేడుకలకు హాజరయ్యే భక్తులకు భోజన,ప్రసాదాలు సైతం అందజేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.దాదాపు 25 వేల మంది భక్తులు నవమి వేడుకలకు హాజరవుతారని అంచనా వేస్తున్న ఆలయ నిర్వాహకులు అందరికీ సరిపడా భోజనాలు,ప్రసాదాలను సిద్ధం చేస్తున్నారు.పెళ్లి సమయంలో ఏ విధంగా భోజనాలను సిద్ధం చేస్తారో... అదే తరహాలో మూడు రకాల కూరలు, సాంబార్,పెరుగు,స్వీట్,పులిహోర సహా ప్రత్యేక వంటకాలను వడ్డించేందుకు సిద్ధమయ్యారు.భక్తులకు భోజన సమయంలో క్యూ కట్టే పనిలేకుండా 5 స్టాల్స్ ను ఏర్పాటు చేస్తున్నారు. ప్రత్యేక వంటశాలను ఏర్పాటు చేసి ఈరోజు రాత్రి నుండే వంటలు ప్రారంభించనున్నారు.

**సీతారామచంద్రస్వామి పెళ్లి వేడుకలకు తరలిరండి**

కరీంనగర్‌లోని శ్రీమహాశక్తి ఆలయంలో నిర్వహించే సీతారామ చంద్రస్వామి పెళ్లి వేడుకలకు ప్రతి ఒక్కరూ తరలిరావాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ పిలుపునిచ్చారు. శ్రీరామ నవమి వేడుకలకు హాజరయ్యే భక్తులందరికీ ఇబ్బందులులేకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. భక్తులందరికీ వేదపండితుల ఆశీర్వచనంతోపాటు తలంబ్రాలను అందజేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

# విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలి

### -వీణవంక కేరళ పాఠశాల రజతోత్సవ వేడుకలు
### -25 ఏళ్ల విద్యా ప్రస్థానం




**చురకలు విలేఖరి వీణవంక మార్చి 26 :** వీణవంక మండల కేంద్రంలోని స్థానిక కేరళ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో రజతోత్సవ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక సర్పంచ్ దాసారపు సరోజన,మండల విద్యాధికారి శోభారాణి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పాఠశాల కరస్పాండెంట్ మనోజ్ కుమార్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన ఆంగ్ల విద్యను అందించాలనే లక్ష్యంతో ప్రారంభమైన ఈ సంస్థ,నేడు వేలమంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడం గర్వకారణమని స్కూల్ కరస్పాండెంట్ తెలిపారు.సర్పంచ్ దాసారపు సరోజన మాట్లాడుతూ..పాఠశాల అభివృద్ధిలో గ్రామస్తుల సహకారం ఎంతో ఉందని, 25 ఏళ్ల ప్రయాణంలో ఎంతో మందిని విద్యావంతులుగా తీర్చిదిద్దడం గర్వకారణమని అన్నారు.మండల విద్యాధికారి శోభారాణి మాట్లాడుతూ.. విద్యాశాఖ ద్వారా అందుతున్న పథకాలను విద్యార్థులు అందిపుచ్చుకోవాలని కోరారు. ఉపాధ్యాయులు నాణ్యమైన బోధన అందిస్తూ, విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయాలని అన్నారు.సాంస్కృతిక ప్రదర్శనలు విద్యార్థులు ప్రదర్శించిన శాస్త్రీయ, జానపద నృత్యాలు అందరినీ అలరించాయి.కేరళ సంప్రదాయాన్ని ప్రతిబింబించే కళారూపాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.ఈ కార్యక్రమంలో న్యూ మిలీనియం పాఠశాల ప్రిన్సిపల్ ముసిపట్ల తిరుపతి రెడ్డి,ట్రినిటీ గ్రూప్స్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ డైరెక్టర్ జోన్ థామస్, విద్యార్థుల తల్లిదండ్రులు,పూర్వ విద్యార్థులు,గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# హుజురాబాద్‌లో.."మద్యం"తో సిండికేట్ చెలగాటం

### -అక్రమార్జనకు కేంద్రంగా "అబ్కారీ"

**(కోరెం సుధాకర్ రెడ్డి చురకలు ప్రతినిధి హుజురాబాద్)**



అక్రమాల అడ్డగా హుజురాబాద్ అబ్కారీ కార్యాలయం మారింది. ఇక్కడ మద్యం దుకాణాలపై ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ పర్యవేక్షణ కొరవడింది. మద్యం దుకాణాలు నియమ నిబంధనలను పాటించడం లేదు. మద్యం వ్యాపారులు సిండికేట్ గా ఏర్పడి అధిక ధరలకు మద్యం విక్రయిస్తూ మందు ప్రియులను దోచుకుంటున్నారు. అనుమతి లేకుండానే సిట్టింగ్లను నిర్వహిస్తున్నారు. పర్మిట్ రూములలో నాణ్యతలేని ఆహారాన్ని సరఫరా చేస్తున్నారు. అలాగే అక్కడ అపరిశుభ్రత విలయతాండవం చేస్తోంది. మద్యం ప్రియుల ప్రాణాలతో అధికారులు, సిండికేట్ చెలగాటం ఆడుతున్నారు. ప్రతినెల ఎక్సైజ్ పోలీసు అధికారులకు మద్యం సిండికేట్ నుండి ఆమ్యామ్యాలు వెళ్తున్నట్లుగా ఆరోపణలు వస్తున్నాయి. పట్టణంలో పలుచోట్ల అక్రమ సిట్టింగులు నడుస్తున్నాయి. పరకాల క్రాస్ రోడ్, సిరిసపల్లి క్రాస్ రోడ్, ఇతర ముఖ్య కూడళ్ళ ప్రాంతాలలో అక్రమ సిట్టింగ్ నడుస్తున్నప్పటికీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. అలాగే అన్ని గ్రామాల్లోనూ ముఖ్య కూడళ్ల వద్ద, ఇతర చోట్ల ఐదు నుండి 10 వరకు బెల్టు షాపులు ఉన్నాయి. ఇవన్నీ ఎలాంటి అనుమతి లేకుండానే నడుస్తున్నాయి. ఈ బెల్ట్ షాపులపై మద్యం సిండికేట్ ఆధిపత్యం చెలాయిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తుంది. బెల్ట్ షాపుల్లోనూ మద్యం అధిక ధరలకు విక్రయిస్తున్నారు. మద్యం ఎక్కడికక్కడ లభ్యం కావడంతో యువత కూడా తప్పుదారి పడుతున్నారు. పలువురు మద్యానికి బానిసలై వారి కుటుంబాలు వీధిన పడుతున్నాయి. చాలామంది అనారోగ్యం పాలు అవుతున్నారు. గ్రామాల్లో ఉన్న బెల్టు షాపుల్లోనూ మద్యాన్ని అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ప్రభుత్వానికి ఆదాయమే ముఖ్యమని బెల్ట్ షాపుల్లో ఏం చేసిన తాము పట్టించుకోము అనే విధంగా అధికారులు వ్యవహరిస్తున్నారు. హుజురాబాద్ లో వైన్ షాపుల వద్ద దారుణమైన పరిస్థితులు నెలకొన్నాయి. రోడ్లపైనే మందుబాబులు మద్యం సేవిస్తూ కనిపిస్తున్నారు. ఇటు పోలీసు శాఖ అటు అబ్కారీ శాఖ నియంత్రణ కరువైంది. వైన్ షాపుల పరిసర ప్రాంతాల్లోని నివాసితులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హుజురాబాద్ లో బెల్ట్ షాపులు, వైన్ షాపుల వద్ద ఉన్న దుస్థితి గురించి హుజురాబాద్ అబ్కారీ సి ఐ శ్రీనివాస్ గౌడ్ కు ఫోన్ చేస్తే ఆయన కనీసం ఫోన్ కూడా లిఫ్ట్ చేయడం లేదని బాధితులు వాపోతున్నారు. ఒక ప్రభుత్వ అధికారి, పబ్లిక్ సర్వెంట్ అయి ఉండి ఫోన్ కాల్స్ కు స్పందించకపోవడం విడ్డూరంగా ఉందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. తనకు ఉన్నతాధికారులు, రాజకీయ నేతల అండదండలు ఉన్నాయని, తనను ఎవరు ఏమి చేయలేరని ఆయన అంటున్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కి మద్యం విక్రయాలు జరుగుతున్నప్పటికీ అధికారులకు కనిపించడం లేదా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు వెంటనే కలగజేసుకొని హుజురాబాద్ లో పరిస్థితిని చక్కదిద్దాలని పలువురు కోరుతున్నారు.

# డంపింగ్ యార్డ్ పేరుతో ప్రజల ప్రాణాలతో చెలగాటమా?

### -బిఆర్ఎస్‌నేత ఎడవల్లి కొండల్ రెడ్డి



**చురకలు ప్రతినిధి హుజురాబాద్ మార్చి 26 :** హుజురాబాద్ మండలం సిర్సపల్లి శివారులో ప్రభుత్వం నిర్మించబోయే డంపింగ్ యార్డ్‌తో వాతావరణం కాలుష్యమై చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అనారోగ్య అనారోగ్యాల బారినపడి చితికిపోయే ప్రమాదం ఉందని,ప్రభుత్వం ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతోందని బిఆర్ఎస్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎడవల్లి కొండల్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డ్ ను రద్దు చేయాలని అఖిలపక్షం ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో చేపట్టిన దీక్షల్లో ఆయన గురువారం పాల్గొని ఆయన మాట్లాడారు. సుమారు 7 నుండి 8 మున్సిపాలిటీల చెత్తను ఒకే చోటుకి చేర్చి కాల్చడం ద్వారా పెద్ద ఎత్తున హాని జరిగే ప్రమాదం ఉందన్నారు. ఇది పెద్ద ఎత్తున కాలుష్యాన్ని వెదజల్లుతుందని తద్వారా మహిళలు చిన్నపిల్లల ప్రాణాలకు ముప్పు ఉందని రైతులు తీవ్రంగా నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయాలకు అతీతంగా అందరూ ఉద్యమించి దీన్ని అడ్డుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఇక్కడ ప్రజానీకానికి ఏమి జరిగినా ప్రభుత్వానిదే బాధ్యత అని ఆయన హెచ్చరించారు. ప్రజల శవాలపై డంపింగ్ యార్డ్ నిర్మిస్తారా? అని ఆయన ప్రశ్నించారు. అది వెదజల్లే కాలుష్యానికి వృద్ధుల ప్రాణాలు పోతే ఎవరిది బాధ్యత అని ఆయన అన్నారు. పచ్చగా ఉన్న హుజురాబాద్ను వల్లకాడు చేస్తారా అని తీవ్రంగా ఆయన మండిపడ్డారు. డంపింగ్ యార్డ్ ఏర్పాటును ఏర్పాటు చేస్తే హుజురాబాద్ మొత్తం ఖాళీ అవుతుందని.. దీనికి అధికార పార్టీ బాధ్యత వహించాలని ఆయన హెచ్చరించారు. డంపు యార్డ్ నిర్మాణంతో హుజురాబాద్ అభివృద్ధి ఆగిపోతుందని రోడ్లపై చెత్త వాహనాలు వెళుతుంటే ఆ చెత్త దుమ్ము ధూళి అంతా దుకాణాల్లో పడుతుందని ఇక ఎవరు వ్యాపారాలు చేసుకోలేరని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ప్రజలందరి సమస్య అని, అది నిర్మాణం జరిగితే ప్రజల ఆరోగ్యానికి తీవ్రమైన హాని ఉంటుందని, ఇక్కడ పశుపక్షాదుల మనుగడ కూడా కష్టమే అని, ప్రకృతి దెబ్బతింటుందని, తాగునీరు కలుషితం అవుతుందని, ప్రజలు రోగాల బారిన పడతారని ఆయన అన్నారు. తక్షణమే డంపింగ్ యార్డ్ ప్రతిపాదనను విరమించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పర్యావరణానికి హాని కలిగించే ఈ ప్రాజెక్టును రద్దు చేయాలన్నారు. సిర్సపల్లితో పాటు చుట్టుపక్కల పది గ్రామాల ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందని, శ్వాసకోశ సంబంధిత వ్యాధులతో పాటు అనేక రకాల అనారోగ్య సమస్యలకు లోనయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రాంత రైతులు వ్యవసాయ భూములు నష్టపోయే అవకాశం ఉందని, భూసారం తగ్గి పంటల దిగుబడి తగ్గిపోతుందని తెలిపారు. ప్రాజెక్టును తక్షణమే ఆపివేయాలని డిమాండ్ చేశారు.

# వరల్డ్ లార్జెస్ట్ పార్టీ బిజెపి....తిరుగులేని శక్తిగా బిజెపి

**-గల్లీ నుండి ఢిల్లీ వరకు దేశవ్యాప్తంగా బిజెపి విస్తరించింది**

**-కరీంనగర్ గడ్డపై కాషాయ జెండా ఎగరవేశాం**

**-గోల్కొండ కోటపై కాషాయ జెండా ఎగరవేస్తాం**

**-బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి**



**చురకలు ప్రతినిధి కరీంనగర్ మార్చి 26 :**
నేషన్ ఫస్ట్, పార్టీ నెక్స్ట్, సెల్ఫ్‌లాస్ట్ సిద్ధాంతంతో, ప్రపంచంలోనే అత్యధిక కార్యకర్తలు కలిగిన పార్టీగా ,వరల్డ్ లార్జెస్ట్ పార్టీగా,తిరుగులేని శక్తిగా భారతీయ జనతా పార్టీ అవతరించిందని జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు.కరీంనగర్ నగరపాలక సంస్థ 24వ డివిజన్ కార్పొరేటర్ ఒంటెల సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో గురువారం రోజున డివిజన్లోని గుండి హనుమాన్ వద్ద నూతనంగా నిర్మించిన బిజెపి జెండా గద్దె,పార్టీ జెండా ఆవిష్కరణ సందర్భంగా గంగాడి కృష్ణారెడ్డిపై వ్యాఖ్యలు చేశారు.మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల సందర్భంగా ప్రపదమంగా డివిజన్లో కాషాయ జెండా ఎగిరిందని, కార్పొరేటర్‌గా సత్యనారాయణ రెడ్డి ఘన విజయం సాధించి,డివిజన్లో పార్టీ జెండా గద్దెను ఏర్పాటు చేయడం సంతోషకరం గా ఉందన్నారు.నేడు బీజేపీ గల్లీ నుండి ఢిల్లీ వరకు దేశవ్యాప్తంగా విస్తరించిందన్నారు.బిజెపి మోది సర్కార్ పాలనతోనే నేడు దేశం సుభిక్షంగా ఉందన్నారు. ప్రపంచంలోని అనేక దేశాలు , అగ్రరాజ్యాలు యుద్ధాలతో కొట్టుమిట్టాడుతుంటే, మోదీ ప్రభుత్వం సుస్థిర పాలన కొనసాగిస్తుందన్నారు. ప్రపంచంలోని అనేక దేశాలకు నేడు మోడీ ప్రభుత్వ పాలన విధానం దిక్సూచిగా మారిందన్నారు.భారతదేశం నేడు విశ్వ గురువు స్థాయికి చేరు కుందన్నారు.దేశ భవిష్యత్తు కోసం, ప్రజల సంక్షేమం,అభివృద్ధి,భద్రత కోసం బిజెపి నిరంతరం ఆలోచిస్తుందన్నారు. కానీ దేశంలోని అనేక పార్టీలు మాత్రం బిజెపి విధానాలకు భిన్నంగా ఉంటాయని,ఆయా పార్టీలు,మనం బాగుంటే చాలు,మన కుటుంబం బాగుంటే చాలు అనుకునే స్వార్ధంతో నే నేటికీ రాజకీయాలు చేస్తున్నాయని ఘాటుగా విమర్శించారు.భవిష్యత్తు అంతా బిజెపి దేనని,కరీంనగర్ గడ్డపై కాషాయజెండా ఎగరవేసినట్టే , గోల్కొండ కోటపై కాషాయజెండా ఎగరవేసి తీరుతామని ఆయన ఈ సందర్భంగా ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో రాబోయేది బిజెపి ప్రభుత్వమేనన్నారు.ఈ కార్యక్రమంలో మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్:వై.సునీల్ రావు,వెస్ట్ జోన్ అధ్యక్షులుజాడి బాల్ రెడ్డి, అధికార ప్రతినిధి:ఊగేల సుధాకర్ పటేల్, నాయకులుగుజ్జ శ్రీనివాస్,డివిజన్ వాసులు అట్ల జగన్ రెడ్డి,కుటాడి శ్రీనివాస్,విష్ణు వర్ధన్,ప్రశాంత్, స్వామి, ఆంజనేయులు,గంగసాని మునీన్దర్, దాసరి రాజిరెడ్డి,తదితరుల పాల్గొన్నారు.

# రూ.5 లక్షల్లోనే ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం

**-కేవలం మూడు నెలల్లోనే పనులన్నీ పూర్తి**

**-400 చదరపు ఫీట్లలో జిల్లాలోని ఆయా మండలాల్లో 11 మోడల్ ఇందిరమ్మ ఇండ్లను నిర్మించిన గృహ నిర్మాణ శాఖ**

**-ఆధునిక సాంకేతికతో ఫిల్లర్ రూఫింగ్ విధానంలో స్లాబ్ నిర్మాణం**

**-సొంత ఇంటి కల నిజం చేసుకోవాలనుకునే అర్హులకు సదవకాశం**




**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డి పేట మార్చి 26 :** ఇల్లు లేని వారి సొంత ఇంటి కల నిజం చేయాలని లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఇందిరమ్మ ఇళ్ల పథకం జిల్లాలో విజయవంతంగా అమలవుతుంది. మోడల్ హౌస్, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ బాధ్యతలను గృహ నిర్మాణ శాఖకు అప్పగించింది. 400 చదరపు ఫీట్లలో రూపాయలు ఐదు లక్షలతో ఇల్లు పూర్తవుతుందని స్పష్టం చేసింది గృహ నిర్మాణ శాఖ. రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక సహాయంతోనే నూతన సాంకేతికత, అద్భుతమైన డిజైన్ లో స్లాబ్ తో ఇందిరమ్మ ఇల్లు పక్కాగా నిర్మించింది.ప్రజా ప్రభుత్వం అర్హులైన వారి సొంతింటి కల నిజం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రవేశపెట్టింది. నిర్దేశించిన 400 నుంచి 600 చదరపు ఫీట్ల వరకు నిర్మించుకోవచ్చని, వారికి రూ. 5 లక్షల ఆర్థిక సహాయాన్ని నాలుగు విడతల్లో నిర్మాణానికి అనుగుణంగా నేరుగా లబ్ధిదారు బ్యాంక్ ఖాతాలో జమ అయ్యేలా ఏర్పాట్లు చేసింది. పేదలకు 400 చదరపు ఫీట్లలో రూపాయలు ఐదు లక్షలు ఇల్లు నిర్మించుకునేలా స్పష్టమైన కార్యాచరణ అవగాహన కల్పించాలని ఉద్దేశంతో గృహ నిర్మాణ శాఖ మోడల్ నిర్మాణాలను జిల్లాలో చేపట్టింది.

**జిల్లాలో 11 నిర్మాణాలు పూర్తి..**

గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని ఆయా మండలాల్లో మొత్తం 11 మోడల్ ఇందిరమ్మ మోడల్ ఇండ్లను 400 చదరపు ఫీట్లలో ఒక ప్రణాళిక ప్రకారం కేవలం మూడు నెలల కాలంలోనే రూ. ఐదు లక్షలతో పూర్తి చేసి వినియోగంలోకి తీసుకొచ్చారు.

**ఇబ్బందులు దూరం చేసేందుకు కమిటీల సేవలు**


గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో మోడల్ హౌస్ లను నూతన సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించారు. ప్రతి మోడల్ హౌస్ లో ఒక హాల్, బెడ్ రూమ్ దానికి అటాచ్డ్ బాత్రూం, అలాగే కిచెన్ సదుపాయాలతో ఇంటిని పూర్తి చేశారు. గోడల నిర్మాణానికి సిమెంటు ఇటుకలు వినియోగించారు. కిటికీలు, దర్వాజలు చెదలు పట్టకుండా చాలా కాలం మన్నికగా ఉండేలా సిమెంటు ఫ్రేములు వినియోగించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో లబ్ధిదారులకు సహాయం అందించేందుకు ఇందిరమ్మ కమిటీలు, హౌసింగ్, ఇతర శాఖల అధికారులు అందుబాటులో ఉన్నారు. ఇంటి నిర్మాణ సామగ్రి, ఇతర ఇబ్బందులను దూరం చేసేందుకు జిల్లా అధికార యంత్రాంగం ఇప్పటికే అధికారులకు ఆదేశాలు జారీ చేసింది.

**ఎండాకాలం చల్లగా.. చలికాలం వెచ్చగా ..**

ఇందిరమ్మ మోడల్ హౌస్ లు ఎండాకాలంలో చల్లగాను.. చలికాలంలో వెచ్చగా ఉండేలా సాంకేతికతను ఉపయోగించారు. స్లాబు నిర్మాణంలో ఫిల్లర్ రూఫింగ్ విధానాన్ని వినియోగించారు. ఇందులో సాధారణ ఇళ్లతో పోలిస్తే స్లాబ్ నిర్మాణంలో 40 శాతం ఖర్చు ఆదా అవుతుంది. కాంక్రీట్, ఐరన్ తక్కువగా ఉపయోగిస్తారు. స్లాబ్ చూడడానికి కూడా ఎంతో అందంగా కనిపిస్తుంది.

**దీర్ఘకాలం పాటు మన్నికగా ఉండేలా..,,,,**

గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో రూ. 5 లక్షలలోనే ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేశారు. నాణ్యతలో కూడా ఇలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా పూర్తి చేశారు. దీర్ఘకాలం పాటు నిలిచి ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన ఆర్థిక సహాయం లోనే ఇంటి నిర్మాణాన్ని చేశారు.ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా జిల్లాలోని అర్హులైన వారు ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయం ఐదు లక్షల తోనే పూర్తిచేసేలా ప్రతి మండల కేంద్రం అలాగే మున్సిపాలిటీలో హౌసింగ్ అధికారులు పూర్తిస్థాయి సహకారం అందిస్తారు. అర్హులైన వారందరూ వారి సలహాలు, సూచనలు పాటిస్తూ ప్రభుత్వ సహాయాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా తమ సొంత ఇంటి కలను నెరవేర్చుకునే అవకాశం ఉంది.



## 16వ డివిజన్

# కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికకు కసరత్తు

**-కార్యకర్తల అభిప్రాయ సేకరణ**

**-ముఖ్య అతిథులుగా ఓడిసిఎంఎస్ మాజీ వైస్ చైర్మన్ గోల్కొండ సదానందం**



**చురకలు ప్రతినిధి, వరంగల్ మార్చి 26 :** వరంగల్ నగరంలోని 16వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సంస్థాగత బలోపేతంలో భాగంగా నూతన అధ్యక్షుని ఎంపిక కోసం కార్యకర్తల సమావేశం ఉత్సాహంగా నిర్వహించారు. 16వ డివిజన్ అధ్యక్షులు దుబ్బాక సంతోష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఓడిసిఎంఎస్ (రాణజమీా) మాజీ వైస్ చైర్మన్ గోల్కొండ సదానందం, పరకాల మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్ష పదవికి సంబంధించి కార్యకర్తల నుంచి అభిప్రాయాలను సేకరించారు. పార్టీ కోసం నిరంతరం శ్రమించే, కార్యకర్తలకు అండగా ఉండే నాయకత్వాన్ని ఎన్నుకోవాలని ఈ సందర్భంగా ముఖ్య అతిథులు సూచించారు.రాబోయే ఎన్నికలు,పార్టీ బలోపేతంపై చర్చ,ప్రతి కార్యకర్త అభిప్రాయానికి విలువనిస్తూ ప్రజాస్వామ్యబద్ధంగా అధ్యక్షుని ఎంపిక.ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యంగా పని చేయాలని పిలుపు.ఈ కార్యక్రమంలో డివిజన్ ముఖ్య నాయకులు,భారీ సంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు,అనుబంధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# మార్చి 29 ఆదివారం ఆరవ తరగతిలో ప్రవేశమునకు ఎంట్రెన్స్ పరీక్ష



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట మార్చి 26 :** తెలంగాణ రాష్ట్రంలోని 23 ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలల్లో 2026-2027విద్యా సంవత్సరం లో ఆరవ తరగతిలో ప్రవేశమునకు ఎంట్రెన్స్ పరీక్ష ఈనెల 29 ఆదివారం రోజున ఈఎంఆర్ఎస్ దుమాలలో జరుగుతుందని ప్రిన్సిపాల్ తెలియజేశారని ఎంఈఓ గాలి పెల్లి కృష్ణ హరి తెలిపారు.ఆరవ తరగతిలో ప్రవేశమునకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు https://tsemrs.telangana.govt.in వెబ్సైట్ నుండి హాల్ టికెట్ డౌన్లోడ్ చేసుకోవాలని తెలియజేశారు.పరీక్షా సమయము ఉదయము 10:30 నుండి 12:30వరకు జరుగునని, అభ్యర్థులను 9:30 నిమిషాలకు పరీక్ష హాల్లోకి అనుమతించ బడునని దుమాల సెంటర్ కు చెందిన అభ్యర్థులు సకాలంలో పరీక్షా కేంద్రం వద్దకు చేరుకోవాలని ఎంఈఓ గాలిపెల్లి కృష్ణహరి సూచించారు.పరీక్ష రాయబోతున్న విద్యార్థులకు ఆయన అభినందనలు తెలిపారు.

# పంట నష్టపోయిన రైతులకు తక్షణమే పరిహారం అందించాలి

**-బీఎస్పీ మండల అధ్యక్షులు గజ్జెల ప్రశాంత్**



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట మార్చి 26 :** ఇటీవల రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలంలో కురిసిన ఆకాల రాళ్ళ వర్షానికి పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం తరుపున ఆదుకోవాలని బహుజన సమాజ్ పార్టీ వీర్నపల్లి మండల అధ్యక్షులు గజ్జెల ప్రశాంత్ ప్రభుత్వాన్ని కోరారు. ఒక వైపు యాసంగి సీజన్ లో నీళ్ల కొరతతో సతమతమవుతున్న తరుణంలో ఇటీవల కురిసిన రాళ్ళ వర్షానికి రైతులకు అధిక నష్టం జరిగింది. అని అన్నారు. తక్షణమే ప్రభుత్వం క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి నష్ట పరిహారం కింద ఎకరానికి 30,000/- ఇచ్చి మండల రైతులను ఆదుకోవాలని ప్రశాంత్ డిమాండ్ చేశాడు. ఈ కార్యక్రమంలో లింగంపల్లి శంకర్,దావ ఆంజనేయులు, గొర్రె రాజయ్య, నర్సయ్య, పోచయ్య, తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు ఆర్థికంగా ఎదగడమే ప్రభుత్వం లక్ష్యం

**-మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి**
**-జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్**



**చురకలు విలేకరి, రాయికల్, మార్చి 26 :** మహిళలకు వడ్డీ లేని రుణాలు అందించి ఆర్థికంగా ఎదగడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు.గురువారం రాయికల్ మండలంలోని కిష్టంపేట గ్రామంలో రెండు మహిళా సంఘాలకు 20 లక్షలతో ,భూపతి పూర్ గ్రామంలో 20 లక్షలతో రెండు,వడ్డే లింగాపూర్ గ్రామంలో 10 లక్షలతో ఒకటి,వడ్డెర కాలనీ లో 10 లక్షలతో ఒకటి,చే ర్ల కొండాపూర్ గ్రామంలో 10 లక్షలతో మహిళా సంఘం నూతన భవన నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి 10 లక్షల చొప్పున 7 మహిళా సంఘాల కు నేడు భూమిపూజ చేయటం శుభ పరిణామం అన్నారు.గ్రామాల్లో మౌలిక సదుపాయాలు,పారిశుధ్యం,త్రాగు నీరు,తదితర కార్యక్రమాలపై 99రోజుల కార్యాచరణ ను సద్వినియోగం చేసుకోవాలి.మహిళా సాధికారత కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు.మహిళలకు 1300 కోట్ల బ్యాంక్ వడ్డీ ప్రభుత్వం చెల్లించిందని అన్నారు.200 యూనిట్ల ఉచిత కరెంట్ ,సన్న బియ్యం, రేషన్ కార్డులు,ఇలా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ నిరుపేదలకు అండగా ఉందన్నారు.ఎలాంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని పరిష్కా రానికి కృషి చేస్తానని అన్నారు.వేసవిలో తాగు నీటి ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.ఇందిరమ్మ ఇళ్ల మంజూరు తో పేదల కళ్ళ లో ఆనందం రాష్ట్రం లో 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా జగిత్యాల కు 3500 మంజూరు కాక రాయికల్ మండలానికి 911 ఇండ్లు మంజూరు అయ్యాయని తెలిపారు.రైతు భరోసా ,రుణ మాఫీ,వ్యవసాయ యాంత్రీకరణ తో రైతులకు అండగా తెలంగాణ సర్కార్ ఉందని అన్నారు.రాయికల్ పట్టణంలో 7 కోట్ల టెండర్ లు పూర్తి అయ్యాయి అని పనులు జరుగుతున్నాయి అన్నారు.అనంతరం రాయికల్ పట్టణంలో గుడేటి రెడ్డి సంఘంలో రాయికల్ పట్టణ మండలానికి చెందిన 76 మంది ఆడబిడ్డలకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకం లో భాగంగా మంజూరైన 76 లక్షల రూపాయల విలువ గల చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేసిన జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ గారు.ఈ కార్యక్రమంలో కమిషనర్ నాగరాజు, ఎంపీడీవో చిరంజీవి,ఎమ్మార్వో నాగార్జున మున్సిపల్ చైర్మన్ కట్కం రవీందర్,వైస్ చైర్మన్ సౌజన్య,ఆత్మ ఛైర్మెన్ కాటిపెల్లి గంగారెడ్డి,మాజీ మున్సిపల్ చైర్మన్ మోర హనుమండ్లు,మాజీ వైస్ చైర్మన్ గండ్ర రమాదేవి, నాయకులు కోల శ్రీనివాస్,సర్పంచులు,కౌన్సిలర్ లు,మాజీ ప్రజా ప్రతినిధులు అధికారులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలు వదంతులను నమ్మవద్దు

**-జిల్లాలో పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ నిల్వలు నిండుగా ఉన్నాయి**
**-జగిత్యాల జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్**

**చురకలు ప్రతినిధి, జగిత్యాల, మార్చి 26 :** ప్రజలు వదంతులను నమ్మవద్దని, జిల్లాలో పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ నిల్వలు నిండుగా ఉన్నాయని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ అన్నారు. జిల్లాలో పెట్రోల్, డీజిల్ మరియు వంట గ్యాస్ (ఎల్పిజి) కొరత ఉందంటూ వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తవమని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. గురువారం జిల్లా సమీకృత కార్యాలయ సముదాయంలో పెట్రోల్ బంక్ అసోసియేషన్ ప్రతినిధులు, ఆయిల్ కంపెనీ సేల్స్ ఆఫీసర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ ప్రస్తుత పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆయిల్ రిఫైనరీల నుండి స్థానిక డిపోల వరకు ఇంధన సరఫరా వ్యవస్థ ఎక్కడా ఆగిపోలేదని, జిల్లా అవసరాలకు మించి నిల్వలు అందుబాటులో ఉన్నాయని ప్రజలు భయాందో ళనలతో ఒక్కసారిగా బంకులకు రావడంతో సాధారణం కంటే 3 రెట్లు విక్రయాలు పెరిగాయని దీనివల్ల కొన్ని చోట్ల తాత్కాలికంగా నో స్టాక్ బోర్డులు కనిపిస్తున్నాయి తప్ప, ఇంధన కొరత లేదన్నారు. పెట్రోల్, డీజిల్ను డబ్బాలు లేదా పిఈఎస్వి నిబంధనల ప్రకారం నేరం. ఇది అగ్ని ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని, బ్లాక్ మార్కెట్ కు పాల్పడినా లేదా అక్రమంగా నిల్వ చేసినా కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని, ప్రభుత్వ అధికారిక ప్రకటనలను మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని, అత్యవసర సేవలు (అంబులెన్సులు), డాక్టర్లు, రైతులు మరియు సరుకు రవాణా



వాహనాలకు ఇబ్బంది కలగకుండా సహకరించాలని ఇంధన సరఫరాలో ఎలాంటి లోపం లేదని తెలిపారు. పౌరసరఫరాల శాఖ, పోలీసు శాఖల సమన్వయంతో పెట్రోల్ బంకులను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, ప్రజలు సంయమనం పాటించాలని కలెక్టర్ కోరారు.

# రైసింగ్ హైస్కూల్‌లో ఆకట్టుకున్న ఫుడ్ ఫెస్టివల్

**-జంక్ ఫుడ్ నివారణపై అవగాహన**

**చురకలు ప్రతినిధి కోరుట్ల,మార్చి 26 :** కోరుట్ల పట్టణంలోని రైసింగ్ హై స్కూల్‌లో ఫుడ్ ఫెస్టివల్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ తరగతుల విద్యార్థినులు స్వయం గా ఇంట్లో తయారు చేసిన పులిహోర, బిర్యానీ, దోసె, పానీపూరీ, స్వీట్స్ వంటి అనేక రకాల వంటకాలను తయారు చేసి ప్రదర్శించారు.ఈ ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం పాల్గొని విద్యార్థులు తయారు చేసిన వంటకాల ప్రదర్శనను తిలకించారు. విద్యార్థులు తయారు చేసిన ఆహార




పదార్థాల రుచులను చూసి విద్యార్థి విద్యార్థినులను అభినందించారు.ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కుడేల రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ పిల్లలు చదువులోనే కాకుండా తినే ఆహార పదార్థాలపై కూడా అవగాహన పెంపొందించేందుకు ఈ ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు.ముఖ్యంగా విద్యార్థులు ఇంట్లో తయారు చేసిన ఆరోగ్యకరమైన సంప్రదాయ ఆహార పదార్థాలు అందరి నీ ఆకట్టుకున్నాయని అన్నారు.ఇంట్లో తయారు చేసిన ఆహారం ఆరోగ్యానికి మేలు చేస్తుందని,బయట ఫాస్ట్ ఫుడ్ ఎక్కువగా తీసుకోవడం వల్ల ఊబ కాయం,గుండె జబ్బులు, మధుమేహం వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఈ సందర్భంగా "జంక్ ఫుడ్‌కు నో చెప్పండి – ఆరోగ్యకరమైన ఇంటి ఆహారానికి యెస్ చెప్పండి" అనే నినాదాన్ని విద్యార్థులతో చేయించారు. ఈ ఫుడ్ ఫెస్టివల్ ద్వారా విద్యార్థుల్లో ఆరోగ్యంపై చైతన్యం పెంపొందించడమే లక్ష్యమని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులలో ప్రతిభను వెలికి తీస్తాయని, వారికి ఆనందాన్ని కలిగిస్తాయని అన్నారు.ఈ కార్యక్రమం లో కరస్పాండెంట్ కుడేల రాజేంద్ర ప్రసాద్,ప్రిన్సిపాల్ లిఖిత, ఉపాధ్యా యులు మోహన్, షహనాజ్ బేగం, వెన్నెల, సుమయ్య, సంజన, మౌనిక, సుమన్ రెడ్డి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# నేడు శ్రీరామ నవమి



**-శ్రీసీతారాముల కళ్యాణం చూతం రారండి**
**-ముస్తాబైన శ్రీసీతారాముల ఆలయాలు**
**-కళ్యాణ నిర్వహణకు మండపాలు సిద్ధం**
**ఆలయకమిటీల ఆధ్వర్యం ఏర్పాట్లు పూర్తి**

**చురకలు విలేకరి ఇబ్రహింపట్నం మార్చి (27) :** శ్రీ సితరాముల కళ్యణ మహోత్సవనికి అలాయాలు సిద్ధమయ్యాయి.శుక్రవారం శ్రీరామ నవమి సందర్భంగా అలాయాలను అలయకమిటీ సభ్యులు చలువపందిర్లు, మామిడి అకు తోరణాలు, విద్యుత్ కాంతులతో అలంకరించారు.కళ్యణం కోసం మండపాలను గురువారం సిద్ధం చేశారు.జగిత్యాల జిల్లాలోని వేములకుర్తి, ఎర్దండి, గోదుర్,తిమ్మపుర్, ఇబ్రహింపట్నం, అమ్మకపెట్, వర్షకోండ, డబ్బ, కోమటికోండాపుర్ తదితర గ్రామలలోని రామమందిరం, గోపాలస్వామి ఆలయాలతోపాటు హనుమాన్ ఆలయాలను రంగురంగుల విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు.వేద పండితుల,స్దానిక అలయాల అర్చకుల ఆధ్వర్యంలో శ్రీరాముడి పట్టాభిషేకం, పట్టువస్త్రాల సమర్పణ, సీతారాముల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించడానికి ఆలయాల్లోని కల్యాణ మండపాలను తీర్చిదిద్దారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.ఉత్సవాల నిర్వహణ కోసం స్వామి వారి పల్లకి లు సిద్ధమయ్యాయి. ఉంచవాలలో పాల్గొనే భక్తుల సౌకర్యఅర్థం ఏర్పాట్లను ఆలయ కమిటీలు సిద్ధం చేశారు.

# ప్రజా దంత వైద్యశాలకు 13ఏళ్ళు

**-గ్రామాల్లో 2 వేల ఉచిత వైద్య శిభిరాలు**
**-50 వేల విలువ గల దంత కిట్స్ ఉచితంగా పంపిణి**
**-డాక్టర్. సృజన, డా.వనితల వెల్లడి**

**జగిత్యాల ప్రతినిధి,మార్చి 26 :** జగిత్యాల జిల్లాలోనీ గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రతి గురువారం ఉచితంగా దంత వైద్య సేవలాందిస్తు ప్రజాధరణ పొందుతున్న జగిత్యాలలోని సృజన దంత వైద్యశాల 13ఏళ్ళుపూర్తి చేసుకుంది.జగిత్యాల జిల్లా కేంద్రంలో డాక్టర్.సృజన పేరున ఆసుపత్రి పెట్టుకుని ప్రతి గురువారం రోగులకు పీజు లేకుండా ఉచితంగా వైద్య సేవలు అందించడంతో పాటు మందులు ఉచితంగా అందిస్తూ ప్రజల్లో మంచి గుర్తింపు పొందారు.ఈనెల 20 నుండి 26 వరకు ఆసుపత్రి 13 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వారం రోజులపాటు ఆసుపత్రికి వచ్చిన రోగులకు ఉచితంగా దంత పరీక్షలు చేస్తూనే ?50వేల విలువ చేసే నోటి సంరక్షణకు అత్యవసరంగా వాడే వస్తువులను ( దంత కిట్స్ ) సృజన దంత ఆసుపత్రి సౌజన్యంతో డాక్టర్.నక్క




వనిత తన సిబ్బంది పూజ లీనా లతో ఉచితంగా రోగులకు అందించి ప్రశంషాలు అందుకున్నారు.ఈ సందర్భంగా డాక్టర్ వనిత గురువారం జగిత్యాలలో మాట్లాడుతూ ఆసుపత్రి స్థాపించినప్పటి నుండి జగిత్యాల జిల్లా వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో 2 వేల ఉచిత దంత వైద్య శిభిరాలు నిర్వ హించి,ఉచితంగా మందులు ఇవ్వడంతో పాటు దంత సమస్యలపై ప్రజలకు అవగాహనా కల్పించినట్లు తెలిపారు .ఈనెల 20 నుండి వారం రోజుల పాటు ఆసుపత్రిలో వచ్చిన రోగులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించామని, మల్లన్నపేటలో ఉచిత దంత వైద్య శిభిరం ఏర్పాటు చేశామని, దంత సమస్యల గురించి ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు ? 50వేల విలువ చేసే దంత కిట్స్ ప్రజలకు అందించా మని తెలిపారు.ఎప్పటిలాగే ప్రజల సహకారం ఉండాలని, మేము కూడా ప్రజలకు దంత సమస్యల గురించి అన్నీ విధాలుగా అవగాహనా కల్పిస్తామని డాక్టర్ వనిత భరోసా ఇచ్చారు.